




# ప్రజావీక్షణం

దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

PJV ప్రజా వీక్షణం టీవి

Subscribe

www.prajaveekshanam.in సంపుటి:16 సంచిక :246 31 శుక్రవారం, జులై 2026 పేజీలు : 08 వెల:రూ.2/-

Published from : Vijayawada, Krishna, Guntur, Kakinada, Vishakhapatnam, Vijayanagaram, Prakasham, Kadapa, Kurnool, Tirupathi, Anantapur, East Godavari, West Godavari


# తెలంగాణ విద్యారంగం బలోపేతానికి కృషి...

హైదరాబాద్,జూలై30( ప్రజా వీక్షణం):



- కార్పొరేట్‌కు దీటుగా పాఠశాలల అభివృద్ధి
- పిల్లల భవిష్యత్ తీర్చి దిద్దేందుకే విద్యాశాఖ చూస్తున్నా
- ఉపాధ్యాయుల పదోన్నతలపై అనుమానాలు వద్దు
- 2034 వరకు నేనే ముఖ్యమంత్రిగా ఉంటా
- సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి

తెలంగాణను విద్యాపరంగా అగ్రగామిగా నిలబెట్టేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. స్కూళ్లను ప్రైవేటుకు దీటుగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యారంగాన్ని పూర్తిస్థాయిలో బలోపేతం చేసేందుకే రాష్ట్ర బడ్జెట్‌లో ఏకంగా 9 శాతం నిధులను ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు. ఓట్ల రాజకీయం కోసం కాకుండా, పిల్లల బంగారు భవిష్యత్తును దిద్ది తీర్చాలనే ఏకైక లక్ష్యంతోనే విద్యాశాఖ బాధ్యతలను తాను స్వయంగా పర్యవేక్షిస్తున్నానని తెలిపారు. గతంలో ఉన్నవారు ఇరిగేషన్ శాఖను ఎంచుకుంటే, నేను విద్యాశాఖ బాధ్యతను నా వద్దే ఉంచుకున్నా. 80 వేల పుస్తకాలు చదివానన్న నాయకుడి కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయింది. కానీ నా ప్రాధాన్యత ప్రాజెక్టులు కావు, పిల్లల చదువులే అని సీఎం అన్నారు. లక్షల మంది ఇంజనీరింగ్ పట్టాలు పొందుతున్నా, ఉద్యోగానికి దరఖాస్తు రాసుకోలేని పరిస్థితి రాకూడదని, విద్యా ప్రమాణాలను పెంచడమే తమ నైతిక బాధ్యత అని స్పష్టం చేశారు. చిన్నతనంలోనే పిల్లలను హాస్టళ్లలో వేయడం వల్ల కుటుంబ సంబంధాలు దెబ్బ తింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఒంటరిగా పెరిగే పిల్లలు పెద్దయ్యాక తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలకు పంపే ప్రమాదం ఉందన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులే తల్లిదండ్రుల స్థానంలో ఉండి పిల్లలకు సరైన మార్గదర్శనం చేయాలని పిలుపునిచ్చారు.

...మిగతా 2 లో...



## చైనా నుంచి ఇరాన్‌కు ఆయుధాలు

- చైనా తీరుపై ట్రంప్ అసహనం

వాషింగ్టన్,జూలై30( ప్రజా వీక్షణం):

అమెరికా విమానాలు, హెలికాప్టర్లకు తలనొప్పిగా మారిన కొన్ని ఆయుధాలను చైనా నుంచి ఇరాన్ కు సరఫరా చేసేందుకు రంగం సిద్ధమైంది.

...మిగతా 2 లో...



## మోడీ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారాలి

- ప్రధాని పదవికి మోడీ రాజీనామా చేస్తేనే మంచిది
- రాష్ట్రాల్లో విద్యార్థులను వేధిస్తే మళ్లీ ఆందోళన తప్పదు
- కాక్రోచ్ చీఫ్ అభిజిత్ దీప్కే హెచ్చరిక

పుణె,జూలై30( ప్రజా వీక్షణం):

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన పదవికి రాజీనామా చేసి సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారాలని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఎద్దేవా చేశారు.

...మిగతా 2 లో...



## వర్షాలపై మంత్రి కోమటి రెడ్డి ఆరా

- అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచన

హైదరాబాద్,జూలై30( ప్రజా వీక్షణం):

తెలంగాణలో రెండు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఆర్ అండ్ బీ అధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షాల వల్ల ముందు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. ఉమ్మడి జిల్లాలు, ఆర్ అండ్ బీ డివిజన్ల వారీగా రోడ్లు, బ్రిడ్జిలు, లో కాజ్‌వేలు, కల్వర్టుల వివరాలపై ఆరా తీశారు. ముంపు ప్రాంతాల్లో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కల్వర్టులు, లో కాజ్‌వేలు, కోతకు గురైన రోడ్ల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు పెట్టాలన్నారు.

...మిగతా 2 లో...



## పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్నాం...

- దశలవారీగా అర్హులందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ

భద్రాద్రి కొత్తగూడెం,జూలై30( ప్రజా వీక్షణం):

పేదలకు ఇంటిచింత లేకుండా చేయాలనే ఇందిరమ్మ ఇళ్లను పెద్ద ఎత్తున నిర్మిస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. విడతల వారీగా పేదలందరికి ఇంటికలను సాకారం చేస్తామని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం రూ.8 లక్షల కోట్ల మేర అప్పులు చేసిందని, పీకల్లోతు కష్టాల్లో ఉన్నప్పటికీ ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.

...మిగతా 2 లో...



## అనుకూలమైన విధానాల అమలుపై దృష్టి

- ఎగుమతుల వృద్ధికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక
- ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో సంజయ్ జాజు

హైదరాబాద్,జూలై30( ప్రజా వీక్షణం):

రాష్ట్రంలో ఎగుమతుల వృద్ధికి చేపట్టాల్సిన చర్యలు, ఎగుమతిదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, కొత్త మార్కెట్ల అన్వేషణ, ఎగుమతులకు అనుకూలమైన విధానాల అమలుపై సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గురువారం సి.ఎస్.

...మిగతా 2 లో...



## ఓటరు జాబితా సవరణతో పథకాలకు సంబంధం లేదు

- ప్రజలు అనవసర అపోహలకు గురి కావద్దు
- ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి స్పష్టీకరణ

హైదరాబాద్,జూలై30( ప్రజా వీక్షణం):

రాష్ట్రంలో ఎస్ఐఆర్ పక్రియలో భాగంగా చేపడుతున్న ఓటరు జాబితా సవరణకు, ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఎలాంటి సంబంధం లేదని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ పక్రియ పురోగతి పై జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్లతో ఎస్ఐఆర్ పక్రియలో భాగంగా డిజిటలైజేషన్ పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సిఇఓ మాట్లాడుతూ కొనసాగుతున్న ఎస్ఐఆర్ పక్రియ కేవలం తప్పులు లేని ఓటరు జాబితా రూపకల్పనకు మాత్రమేనని, ప్రభుత్వం పథకాలకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు.

...మిగతా 2 లో...

## పవన్‌తో మంత్రి నిమ్మల భేటీ

అమరావతి,జూలై30( ప్రజా వీక్షణం):



రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గురువారం భేటీ అయ్యారు. సూపర్ ఎల్‌నినో పరిస్థితులపై చర్చించారు. సూపర్ ఎల్‌నినో, తద్వారా రాష్ట్రంలో నెలకొన్న సాగు నీటి సంక్షోభంపై రైతుల్లో అవగాహన కల్పించాలని పవన్ సూచించారు. రైతులతో ప్రత్యక్ష సమావేశాలు నిర్వహించి పరిస్థితులను వివరించాలన్నారు. సంక్షోభ నివారణకు ప్రత్యామ్నాయ మార్గాల అన్వేషణపై దృష్టి సారించాలని అన్నారు. ఏలేరు ప్రాజెక్టు నుంచి 1,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినందుకు నిమ్మలకు పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు.నీటి విడుదలతో పిఠాపురం, పెద్దాపురం, జగ్గంపేట రైతులకు సాగునీటి సమస్యకు ఊరట లభించిందని పవన్ అన్నారు. సూపర్ ఎల్‌నినో ప్రభావంపై గ్రామస్థాయిలో ప్రచారం చేపట్టాలని సూచించారు. ప్రతి రైతు పీఎం ఫసల్ బీమా యోజనలో చేరేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం ప్రతి నీటి బొట్టు విలువైనదే అని... నీటి వృథాను అరికట్టాలని చెప్పారు. కాలువల్లో పూడిక తొలగింపు, నీటి గట్టుల లీకేజీల నివారణపై దృష్టి సారించాలన్నారు. కాకినాడ జిల్లా, పిఠాపురంపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఎల్‌నినోపై రైతులకు అవగాహన కల్పించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు బాధ్యత తీసుకోవాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచనలు చేశారు. ఈ సందర్భంగా భుజం శస్త్రచికిత్స చేయించుకున్న పవన్‌ను మంత్రి నిమ్మల రామానాయుడు పరామర్శించారు. త్వరగా కోలుకుని ప్రజాసేవలో మరింత చురుగ్గా పాల్గొనాలని నిమ్మల ఆకాంక్షించారు.

## అంగన్‌వాడీ టీచర్ల నుంచి నేరుగా సలహాల స్వీకరణ...

- అంగన్‌వాడీ వ్యవస్థ మరింత బలోపేతం
- జిల్లాల వారీగా ప్రత్యేక సదస్సుల నిర్వహణ
- అధికారులతో సమీక్షించిన మంత్రి సీతక్క



హైదరాబాద్,జూలై30( ప్రజా వీక్షణం):

అంగన్‌వాడీ వ్యవస్థను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు. అందులో భాగంగా అంగన్‌వాడీ టీచర్ల నుంచి నేరుగా సలహాలు, సూచనలు స్వీకరించేందుకు జిల్లాల వారీగా ప్రత్యేక సదస్సులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

...మిగతా 2 లో...

# సంపాదకీయం

## ప్రతిపక్షంగా విఫలం అవుతున్న కాంగ్రెస్ !

ఈ దేశ దౌర్భాగ్యం ఏమంటే అసమర్థ కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉండడం. అధికారంలో ఉంటే అవినీతికి పాల్పడడం, కుంభకోణాలను చేయడం, పాలనను గాలికి వదిలి వేయడం చూశాం. పదేళ్ల యూపిఎ పాలనలో మన్మోహన్ సింగ్‌ను ముందుకు పెట్టి ఎన్ని అరాచకాలు చేశారో చెప్పలేం. అలాగే ప్రతిపక్షంలో గత పదేళ్లుగా నిర్మాణాత్మక పాత్ర పోషించడంలోనూ విఫలం అవుతూ వస్తోంది. నిజానికి ప్రజాస్వామ్యంలో బలమైన ప్రతిపక్షానిదే బలమైన పాత్ర అని చెప్పాలి. దీనిని గుర్తించి నడచుకోవడంలో కూడా కాంగ్రెస్ పూర్తిగా విఫలం అయ్యింది. అధికార ఎన్‌డిఎ తప్పుడు పనులు చేస్తుంటే నిలదీయడం లేదు. ఆశ్రిత పక్షపాతం చూపితే నిలదీయడం లేదు. ప్రజల్లో చైతన్యం తెచ్చే కార్యక్రమాలు చేయడం లేదు. ఎందుకంటే ఆశ్రితపక్షపాతం, బంధుప్రీతి, కుటుంబ పాలన కాంగ్రెస్‌లో నరనరాన జీర్ణించుకుపోయింది. ఇంట్లో ఉన్న ముగ్గురు వ్యక్తులు పార్లమెంట్‌లోనే ఉన్నారు. కుటుంబ పాలనకు ఇదే నిదర్శనం. ఇకపోతే పార్లమెంట్ సమావేశాల్లో కూడా బలంగా ప్రజల వాణిని విన్పించడం లేదు. కాక్రోచ్ పార్టీకి వస్తున్న ఆదరణను తమ ఖాతాలో వేసుకునేందుకు ఎత్తులు వేస్తున్నారు. వారి ఉద్యమాన్ని హైజాక్ చేసి లబ్ది పొందే ప్రయత్నాల్లో ఉన్నారు. ఈ క్రమంలో వారుచేస్తున్న ఆందోళనలు ఎబ్బెట్టుగా ఉన్నాయి. తాజాగా పార్లమెంట్ లోపలా బయటా విద్యార్థులపై లాఠీఛార్జ్‌కు ఎవరు ఆదేశించారో చెప్పాలన్న డిమాండ్ చేస్తున్నారు. పార్లమెంట్ బయట ప్లకార్డులు పట్టుకుని ఆందోళనకు దిగారు. అందరూ గతంలో పాలన చేసిన వారే. కాంగ్రెస్, సమాజ్‌వాదీ, తృణమూల్ అంతా పాలకులుగా ఉండివచ్చిన వారే. లాఠీ ఛార్జ్ చేయమని హోంమంత్రి ఆదేశిస్తారా అన్నది కూడా తెలియని వారు మన పాలనా వ్యవస్తలో ఉండడం దౌర్భాగ్యం. పోలీస్ మాన్యువల్ కూడా తెలియకుండా రాహుల్, ప్రియాంక, అఖిలేశ్ యాదవ్ మాట్లాడుతున్నారు. లా అండ్ ఆర్డర్ కంట్రోల్ తప్పితే పోలీసులే నిర్ణయం తీసుకుని లాఠీఛార్జ్ చేస్తారు. నిషేధిత పార్లమెంట్ పరిసరాల్లో, ప్రధాని నివాసం వద్ద ఎలాంటి ఆందోళనలు జరిగినా తప్పకుండా కంట్రోల్ చేస్తారు. ఇదికూడా తెలియ నట్లుగా ప్లకార్డులు పట్టుకుని లాఠీఛార్జ్‌కు ఎవరు ఆదేశాలిచ్చారో చెప్పాలని నినాదాలు చేయడం సిగ్గుచేటు. ఇది కేవలం రాజకీయంగా చేస్తున్న ఆందోళన తప్ప ఇందులో చిత్తశుద్ది లేదని వారికి కూడా తెలుసు. అసలు కాంగ్రెస్ నిర్మాణాత్మకంగా వ్యవహరించి ఉంటే ఇవాళ విద్యార్థులు రోడ్డుకెక్కాల్సిన అవసరం వచ్చి ఉండేది కాదు. జూన్ 6న సీజేపీ ఏర్పడడంపై వచ్చిన ప్రతిస్పందన చూసిన తర్వాతగానీ కాంగ్రెస్ గళం విప్పలేదు. మే మొదటి వారంలో పేపర్ లీక్ జరిగి, మే 12న పరీక్ష రద్దయిన తర్వాత కాంగ్రెస్ తీవ్రంగా ప్రతిస్పందించి ప్రభుత్వాన్ని జవాబుదారీ చేసేందుకు చేయాల్సినన్ని ప్రయత్నాలు చేయలేదు. జూన్ 17న రాజస్థాన్‌లోని కోటాలో 'ఛాత్రోంకి గుంజ్' పేరిట విద్యార్థుల ర్యాలీని నిర్వహించిన రాహుల్‌గాంధీ ఆ తర్వాత 23 రోజుల పాటు అదృశ్యమై జర్మనీలో కాలక్షేపం చేశారు. సీజేపీ వ్యవస్థాపకుడు ఢిల్లీలో ప్రవేశించి తమ ఆందోళన తీవ్రతరం చేసిన తర్వాత, పార్లమెంటు సమావేశాలు మరో మూడు రోజుల్లో జరుగుతా యనగా రాహుల్‌లో కలవరం కలిగింది. అందుకే అమాంతంగా లేచి ప్రధాని నివాసం ముందు ధర్నాకు దిగారు. రాజకీయాల్లో నిరంతరత్వం, నిత్య క్రియాశీలత్వం లేకపోతే పరిస్థితి మరొకరి చేతుల్లోకి వెళుతుందన్న విషయం రుజువైంది. మునుపటిలాగా నాటకీయంగా ధర్నాలు చేయడం, అరెస్టు కావడం వల్ల ప్రజల సానుభూతి లభించదని కాంగ్రెస్ గ్రహించాలి. 2014 నుంచీ పార్లమెంట్‌ను కాంగ్రెస్ స్తంభింపజేయడం, నిరసన ప్రదర్శనలు నిర్వహించడం వంటివి చేస్తూనే ఉన్నది. అందంతా కేవలం నాకీయ రాజకీయ ప్రయోజనం కోరి చేస్తున్నవే. కేవలం నెలరోజుల నిరసనతో కాక్రోచ్ పార్టీ ప్రభుత్వాన్ని దిగివచ్చేలా చేయగలిగింది. అటువంటి నైతిక స్థైర్యం కాంగ్రెస్, ప్రతిపక్షాలకు ఎందుకు లేకుండా పోయిందన్నదే ప్రశ్న. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడానికే కాదు, పరీక్షల్లో అక్రమాలను నిరోధించేం దుకు ప్రభుత్వం ఆగమేఘాలపై బిల్లు తేవడానికి, ప్రధానమంత్రి రాత్రి పొద్దుపోయిన తర్వాత ఈ బిల్లు గురించి ప్రకటించడానికి సిజెపి ఉద్యమమే కారణం. నెల రోజులకు పైగా శాంతియుతంగా నిరసన ప్రదర్శన చేస్తూ పరీక్షా పత్రాల లీక్‌కు విద్యామంత్రి నైతిక బాధ్యత వహించాలని కోరిన యువతీ యువకులతో దేశవ్యాప్తంగా ఎంతోమంది కనెక్టయ్యారు. నిజానికి ప్రతి ఉద్యమంలోనూ ఎంతో కొంత హింసాకాండ, విధ్వంసం జరుగుతూనే ఉన్నది. చాలాసార్లు పోలీసుల దమనకాండ అణచితేకు పోలీసులు లాఠీఛార్జ్ షరామమాలే. అంతమాత్రాన మొత్తం ఉద్యమానికి విశ్వసనీయత లేకుండాపోదు. అయితే ప్రతిపక్షంగా కాంగ్రెస్ విఫలం అవుతూనే ఉంది. ఇప్పుడు రాహుల్ వారిని భుజాన వేసుకుని ఊరేగే ప్రయత్నం చేస్తున్నారు. దీనిని ప్రజలు గమనిస్తున్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడాన్ని అవమానంగా భావించనక్కర్లేదు. జరిగిన పరిణామాల్ని ఆత్మావలోకనం చేసుకుని తగిన చర్యలు తీసుకునేందుకు లభించిన అవకాశంగా భావించాలి. కాంగ్రెస్ ఇప్పటికైనా నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరించాలి. లేకుంటే కాంగ్రెస్ ప్రతిపక్ష స్థానం కూడా కోల్పోతుంది.

## అంగన్‌వాడీ టీచర్ల నుంచి నేరుగా సలహాల స్వీకరణ...

మొదటిపేజీ తరువాయి

తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ పనితీరుపై మంత్రి సీతక్క ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల సమస్యలను తక్షణమే గుర్తించి వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. టీచర్లు, ఆయాలకు అందించే నూతన యూనిఫామ్‌లను పరిశీలించి, అక్టోబర్ మొదటి వారంలోగా వాటిని సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. అలాగే ప్రస్తుతం 17 ఉన్న శిశు దత్తత కేంద్రాలను విస్తరించి ప్రతి జిల్లాలోనూ ఒక అడాప్షన్ సెంటర్ ఉండేలా చూడాలన్నారు. ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి సంబంధించి ఇప్పటికే 16 జిల్లాల్లో నోటిఫికేషన్లు ఇచ్చామని అధికారులు తెలిపారు. మిగతా జిల్లాల్లో కలెక్టర్లతో మాట్లాడి నియామక పక్రియను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. అంగన్‌వాడీల్లో పిల్లలకు అందుతున్న పోషకాహారం, వారి ఎదుగుదలపై శాంపిల్ సర్వే నిర్వహించి నివేదిక అందించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ నిధులు ల్యాప్స్ కాకుండా పూర్తి స్థాయిలో వినియోగించాలని అధికారులకు నిర్దేశిరచారు. అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. సచివాలయంలో మహిళా, శిశు సంక్షేమ శాఖపై మంత్రి సీతక్క సమీక్ష నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసేందుకు జిల్లాల వారీగా అంగన్వాడీ టీచర్లు, ఆయాలతో సదస్సులు నిర్వహించి వారి సూచనలు స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. కేంద్రం నుంచి వచ్చే నిధులు లాప్స్ కాకుండా ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి రూపాయిని సమర్థవంతంగా వినియోగించాలని మంత్రి అధికారులకు సూచించారు.

## పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్నాం...

మొదటిపేజీ తరువాయి

గురువారం జిల్లాలోని చంద్రుగొండ మండలం మంగయ్య బంజర గ్రామంలో 45 లక్షల రూపాయల నిధులతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్, లో – లెవల్ కాజ్‌వేను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత కరెంటు, మహిళలకు ఉచిత బస్సు, రాష్ట్రవ్యాప్తంగా మొదటి దశలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామన్నారు. రెండో విడతలో 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు వెల్లడించారు. దీంతో రెండు దఫాలుగా ఏడు లక్షల ఇందిరమ్మ ఇళ్లను పేదవారికి మంజూరు చేసినట్లు తెలిపారు. హైదరాబాద్ నగరంలో లక్ష ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని మంత్రి వెల్లడించారు. మూడు, నాలుగో విడతలో ప్రతి ఒక్క అర్హుడైన పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో కులం, మతం, పార్టీ అని చూడటం లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేస్తున్న ఈ ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

## అనుకూలమైన విధానాల అమలుపై దృష్టి

మొదటిపేజీ తరువాయి

అధ్యక్షతన రాష్ట్ర ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో పరిశ్రమలు, తయారీ (మ్యానుఫ్యాక్చరింగ్) యూనిట్లు, వ్యవసాయం, ఆహార ప్రాసెసింగ్, ఫార్మాస్యూటికల్స్, హస్తకళలు, ఐటీ ఆధారిత సేవలు తదితర రంగాల ఎగుమతులను మరింత ప్రోత్సహించేందుకు అన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. గుమతుల ద్వారా రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి మరింత ఊతమివ్వడంతో పాటు తెలంగాణను దేశంలోని ప్రముఖ ఎగుమతి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. త ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రం నుంచి రూ.1,22,655 కోట్ల విలువైన ఎగుమతులు నమోదయ్యాయని అధికారులు సమావేశంలో తెలిపారు. ముఖ్యంగా వ్యవసాయ ఉత్పత్తులు, ఉద్యానవన పంటలు (హార్టికల్చర్), పౌల్ట్రీ ఉత్పత్తులు, వెజిటబుల్ సీడ్స్, రెడ్ చిల్లీ తదితర రంగాల్లో ఎగుమతులను గణనీయంగా పెంచే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు మరింతగా ఎగుమతి చేసేందుకు రాష్ట్రంలో అనుకూల వాతావరణం ఉందని వివరించారు. కేంద్ర ప్రభుత్వ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ అధికారులతో సమన్వయం పెంపొందించి రాష్ట్ర ఎగుమతుల వృద్ధికి మరింత కృషి చేయాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. ఈ సమావేశంలో పర్యాటక, సంస్కృతి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, రవాణా శాఖ కమిషనర్ ఇల్లంబర్తి, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ డా.జి.ముకుంద రెడ్డి, ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, ఎగుమతుల ప్రోత్సాహక సంస్థల ప్రతినిధులు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మోడీ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మారాలి

మొదటిపేజీ తరువాయి

దేశాన్ని పాలించడం కంటే ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మోదీ బాగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రధాని పదవికి రాజీనామా చేసి దేశాన్ని నడిపే బాధ్యతను మరో నాయకుడికి అప్పగించాలన్నారు. ఢిల్లీలో నిరసనలు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత తొలిసారి తన స్వస్థలమైన మహారాష్ట్రకు అభిజీత్ చేరుకున్నారు. ఈ సందర్భంగా అభిజీత్ దీప్కే మీడియాతో మాట్లాడుతూ.. ఢిల్లీలో ఆందోళనలను విరమించిన తర్వాత వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థి నిరసనకారులను గుర్తించి వేధిస్తున్నాయని ఆరోపించారు. ఆయా ప్రభుత్వాలు వెంటనే ఈ వేధింపులను ఆపాలని, లేకపోతే రానున్న ఎన్నికల్లో విద్యార్థులు, యువత తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో విద్యార్థుల్లో ఉన్న ఆగ్రహం ఏమాత్రం తగ్గలేదన్నారు. యువత ఆగ్రహం ఒక్క మంత్రిపై కాదని, కేంద్ర ప్రభుత్వంపైనే ఉందన్నారు. యువతలో ఉన్న అసంతృప్తిని బీజేపీ ఇప్పటికీ అర్థం చేసుకోలేకపోతోందని అభిజీత్ విమర్శించారు. ఇలాగే విద్యార్థులను లక్ష్యంగా చేసుకుంటే ఉద్యమం మరింత ఉధృతమవుతుందని అభిజీత్ హెచ్చరించారు. వీరు ఉగ్రవాదులు కాదని, దేశ భవిష్యత్తని ఆయన పేర్కొన్నారు. దేశ భవిష్యత్తును ఇలాంటి పరిస్థితులకు గురి చేస్తే, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసినట్లే అవసరమైతే ప్రభుత్వాన్నీ మార్చే ఉద్యమం చేపడతామని తేల్చిచెప్పారు. ఈసారి ఆందోళన మరింత భారీస్థాయిలో ఉంటుందని హెచ్చరించారు. ఢిల్లీ జంతర్‌మంతర్‌లో సీజేపీ నిరసన సందర్భంగా విద్యార్థులపై పె÷–లలెట్ గన్ వినియోగించిన ఘటనపైనా అభిజీత్ స్పందించారు. అమిత్ షా అయినా, మరెవరైనా సరే పెల్లెట్ గన్ కాల్పులకు ఆదేశాలు ఇచ్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం సీజేపీ కార్యకర్తలు సంబరాలు చేసుకోవడంపై వచ్చిన విమర్శలను సీజేపీ వ్యవస్థాపకుడు తిప్పికొట్టారు. కార్యకర్తలు 36 రోజుల పాటు ఎండ, వర్షాన్ని లెక్కచేయకుండా కష్టపడి పోరాడారని, అలాంటి విజయం తర్వాత సంబరాలు చేసుకోవడంలో తప్పేముందని ప్రశ్నించారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత బీజేపీ కూడా సంబరాలు చేసుకుంటుందని గుర్తు చేశారు. తమ కార్యకర్తలు బీజేపీ మాదిరిగా రహదారులను దిగ్బంధం చేయలేదన్నారు. ఈ సందర్భంగా రాజీనామా చేసిన ధర్మేంద్ర ప్రధాన్‌ను పార్లమెంట్‌లో బీజేపీ సన్మానించడం సిగ్గుచేటని విమర్శించారు. విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్న తర్వాత ఆయనను సన్మానించడం ద్వారా బీజేపీ ఏ సందేశం ఇవ్వాలనుకుంటోందని ప్రశ్నించారు.

## వర్షాలపై మంత్రి కోమటి రెడ్డి ఆరా

మొదటిపేజీ తరువాయి

అధికారులు అందరూ ఫీల్డ్‌లో ఉండాలని ఆదేశించారు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న రోడ్లు, బ్రిడ్జిల వద్ద తగు జాగ్రత్త చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ, పోలీస్, విద్యుత్, ఇరిగేషన్ శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రతి రోజు ఫీల్డ్ రిపోర్ట్ తయారు చేయాలని, క్షేత్రస్థాయి ఇంజినీర్లతో మొబైల్ ఫోన్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తానని వెల్లడించారు. ఈఎన్సీ నుంచి ఏఈ వరకూ అందరు పూర్తి అలెర్ట్‌గా ఉండాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

## ఓటరు జాబితా సవరణతో పథకాలకు సంబంధం లేదు

మొదటిపేజీ తరువాయి

ఎన్యూమరేషన్ ఫారాలను సమర్పించేందుకు మరో నాలుగు రోజులు గడువు మాత్రమే ఉన్నందున ఆగస్టు మూడవ తేదీలోగా డిజిటలైజేషన్ పక్రియ 100శాతం పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 76శాతం డిజిటలైజేషన్ పక్రియ పూర్తయిందని, గ్రామీణ ప్రాంతాల్లో 90శాతం పూర్తయిందని, ఇందులో ఖానాపూర్, బాల్కొండ, ఎల్లారెడ్డి, హజూర్ నగర్, నర్సంపేట్, వర్ధన్నపేట్, పరకాల, బోద్ నియోజకవర్గాల్లో 100శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని, ఇందుకు సంబంధించిన అధికారులను సిఇఒ ప్రశంసించారు. శేరిలింగంపల్లి, రంగారెడ్డి, మేడ్చల్, జిహెచ్ఎంసితో పాటు నిజామాబాద్, వరంగల్, ఖమ్మం లిం పట్టణ ప్రాంతాలలో డిజిటలైజేషన్ పక్రియపై సంబంధిత డిఇఒలు ప్రత్యేక దృష్టి సారించి డిజిటలైజేషన్ పక్రియను గడువులోగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఎన్యూమరేషన్ ఫారాలను డిజటలైజేషన్ చేయడంలో ఓటరు పేర్లను తప్పులు లేకుండా అప్ లోడ్ చేసేలా బిఎల్‌ఒలు, సూపర్ వైజర్లు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఇఆర్ఒ, ఎఇఆర్ఒలు దీనిపై సమీక్షించి తప్పులు లేకుండా చూడాలని పేర్కొన్నారు. డిజిటలైజేషన్ లో నిర్లక్ష్యం వహించిన బిఎల్‌ఒలు, సూపర్ వైజర్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని సిఇఒ హెచ్చరించారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పోలింగ్ స్టేషన్ల రాష్నాలైజేషన్ పక్రియను వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు. ఒకే కుటుంబ సభ్యుల పేర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చూడాలన్నారు. ఓటర్లలో మరణించిన వారు, ఇల్లుమరిన వారి వివరాలు, అందుబాటులో లేని వారి జాబితాను సిద్ధంచేసేటప్పుడు అన్ని రాజకీయ పార్టీలకు సంబంధించిన బిఎల్‌ఎల సంతకాలను తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో ఇఆర్‌ఒ, ఎఇఆర్‌ఒ, బిఎల్‌ఒ స్థాయిలలో జరిగే రాజకీయ పార్టీల సమావేశాలను వీడియోగ్రాఫ్ చేసి డాక్యుమెంట్ చేయాలన్నారు. దాంతోపాటు విఐపి, వివిఐపిల ఓటర్లను గుర్తించి మ్యాపింగ్ చేయాలన్నారు.

## తెలంగాణ విద్యారంగం బలోపేతానికి కృషి...

మొదటిపేజీ తరువాయి

ప్రత్యామ్నాయంగా, ప్రతి మండలాన్ని ఒక క్లస్టర్‌గా తీసుకుని విద్యా ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. విద్యాబోధనలో అంతర్జాతీయ ప్రమాణాలు అందించేందుకు ఏటా 10 నుండి 12 మంది ఉపాధ్యాయులను 'స్టడీ లీవ్'పై విదేశాలకు పంపిస్తామని ప్రకటించారు. టీచర్ల ప్రమోషన్లు, బదిలీల బాధ్యతను తానే చూసుకుంటానని, అడగకుండానే ఒకటో తేదీన జీతాలు వేస్తున్నామని గుర్తుచేశారు. ఇదే క్రమంలో తన రాజకీయ ప్రస్థానంపై స్పందిస్తూ 2034 వరకు నేనే సీఎంగా ఉంటాను, ఎలాంటి సందేహాలు వద్దని ధీమా వ్యక్తం చేశారు. దీనిపై ఎవరూ ఎలాంటి అనుమానాలు, డౌట్లు పెట్టుకోవాల్సిన అవసరం లేదని ధీమా వ్యక్తం చేశారు. ఫిన్‌లాండ్, జర్మనీ పర్యటన ముగించుకుని వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి ఉపాధ్యాయుల బృందంతో ఇవాళ ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ లో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ భేటీలో సీఎం మాట్లాడుతూ.. ప్రభుత్వ నిర్వహణలో తాము మానవత్వంతో వ్యవహరిస్తూ, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులతో మాట్లాడిన సీఎం, వారి సమస్యల పరిష్కార బాధ్యతను పూర్తిగా తానే తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రమోషన్లు, బదిలీలు ఇంటికే వస్తాయని, ఉపాధ్యాయులు కేవలం విద్యార్థుల భవిష్యత్తు, బడులలో సౌకర్యాల పైనే దృష్టి పెట్టాలని కోరారు. ఐఏఎస్ అధికారులనైనా సులభంగా బదిలీ చేయవచ్చని, కానీ టీచర్ వ్యవస్థ అత్యంత శక్తివంతమైనదని కొనియాడారు. బడులలోని పిల్లల సమస్యలపై తనతో చర్చలకు రావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ బడులలో చదివితే ఏం అవుతావు?' అని ఎవరైనా అడిగితే, 'తెలంగాణ సీఎం అవుతాను' అని పిల్లలు ధైర్యంగా చెప్పాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. తాను స్వయంగా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకుని, ఎలాంటి మంత్రి పదవి అనుభవం లేకపోయినా ఈరోజు సమర్థవంతంగా రాష్ట్రాన్ని పాలిస్తున్నానని గుర్తుచేశారు. ఇటీవల తాను హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో చదువుకున్నానని చెబుతూ, కేవలం తెలివి ఉంటే సరిపోదని, క్రమశిక్షణేళి మనిషిని ఉన్నత స్థానంలో నిలబెడుతుందని నొక్కి చెప్పారు. తాను రాజీ నామా చేయాలని ప్రతిపక్షాల నేతలు అంటున్నారని అన్నారు. విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, లంచ్, స్నాక్స్ పెట్టినందుకు రాజీనామా చేయాలా అని ప్రశ్నించారు. తాను కూడా మెళకువలు నేర్చుకోవడానికి హార్వర్డ్ వెళ్లానని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు.

## చైనా నుంచి ఇరాన్‌కు ఆయుధాలు

మొదటిపేజీ తరువాయి

వీటి రవాణాకు పాకిస్థాన్‌ను మార్గంగా ఎంచుకొన్నట్లు అంతర్జాతీయ వార్తా సంస్థ సంచలన కథనం ప్రచురించింది. దీంతో అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ స్పందించారు. పాక్ పేరు ఎత్తకుండా చైనాపై అసంతృప్తి వ్యక్తం చేశారు. చైనా ఆయుధాల సరఫరా విషయం తెలుసుకొని తాను నిరాశకు గురైనట్లు పేర్కొన్నారు. తాము ఇరాన్‌కు ఆయుధాలు విక్రయించ బోమని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ స్వయంగా తనకు హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. చైనా, రష్యాల నుంచి ఇరాన్‌కు ఆయుధాలు సరఫరా చేయవద్దని గత వారం ట్రంప్ హెచ్చరికలు కూడా జారీ చేశారు. చైనా నుంచి దాదాపు 60 మిలియన్ డాలర్లకు పైగా విలువైన 400 షోల్డర్గ÷ర్డ్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల కొనుగోలుకు ఒప్పందం జరిగింది. వీటితో తమ గగనతల రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేసుకోవాలని ఇరాన్ భావిస్తోంది. అయితే.. ఈ డీల్‌కు టెహ్రాన్ పక్షాన హాంకాంగ్ చెందిన ఝూంగ్‌కింగ్ బావోషాంగ్ ఇంటర్నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ మధ్యవర్తిగా ఉంది. ఈ క్షిపణులను ఉత్తర చైనా నుంచి పాకిస్థాన్ మీదుగా ఇరాన్‌లోకి చేర్చాలని ప్రణాళిక సిద్ధం చేశారు. కాకపోతే వీటిని భూమార్గంలో తరలిస్తారా..? గగనతలంలో తీసుకెళతారా అనే అంశంపై స్పష్టత లేదు. అయితే ఈ కథనాలను చైనా కొట్టిపారేయడం గమనార్హం. ఈ క్రమంలోనే తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ అంశంపై స్పందించారు.

# ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి దేవాలయాలు, గ్రామాల అభివృద్ధికి రూ 19.80 కోట్ల నిధులు కోరిన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్





తాడేపల్లిగూడెం ప్రతినిధి జులై 30 (ప్రజా వీక్షణం)

గోదావరి పుష్కరాల దృష్ట్యా తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో దేవాలయాల అభివృద్ధికి, ముఖ్యమైన గ్రామాల్లోని రహదారుల నిర్మాణానికి రూ. 19.80 కోట్లు నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని కలిసి కోరడంతో పాటు ముఖ్యమంత్రి కార్యాలయంలో లేఖను అందజేశానని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ గురువారం తెలిపారు. అత్యవసరంగా అల్లంపురం నుంచి అత్తిలి వరకు రహదారి నిర్మాణానికి రూ.3 కోట్లు వెంటనే మంజూరు చేశారని, ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే అలంపురం, రావిపాడు, బి.కొండేపాడు, మీన వల్లూరు, రామచంద్రపురం గ్రామాల ప్రజలకు అవస్థలు తప్పుతాయని చెప్పారు. పుష్కరాల సందర్భంగా భక్తులు వల్లూరుపల్లి, వీరంపాలెం, బి.కొండేపాడు దేవాలయాలను సందర్శించే అవకాశం ఉన్నందున, ఆయా ప్రాంతాల్లో మౌలిక వసతులను ముందస్తుగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని లేఖలో వివరించానన్నారు. దేవాలయాల పునరుద్ధరణ, క్యూ కాంప్లెక్సుల నిర్మాణం, ప్రాకారాల విస్తరణ, తాగునీరు, మరుగుదొడ్లు, విశ్రాంతి షెడ్లు, దుస్తులు మార్చుకునే గదులు, ఆలయాలకు వెళ్లే రహదారుల విస్తరణ, హైమాస్ట్ సోలార్ లైట్ల ఏర్పాటు, ప్రసాద తయారీ కేంద్రాల ఆధునికీకరణ, ఆలయ పరిసరాల సుందరీకరణకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరానని తెలిపారు. నియోజకవర్గంలోని రహదారుల అభివృద్ధికి పుష్కర నిధులు రూ.19.80 కోట్ల నిధులు చేయాలని మరో లేఖలో కోరానని, కోనాల రహదారి--జెట్ల పాలెం--దర్సిపర్రు--రాచర్ల మార్గం, తాడేపల్లిగూడెం --అనంత పల్లి రహదారి, ప్రతిపాడు--నిడదవోలు రాష్ట్ర రహదారి, విజయవాడ--విశాఖ పట్నం జాతీయ రహదారిలోని పలు భాగాల అభివృద్ధి పనులను చేపట్టేందుకు ప్రతిపాదనలు సమర్పించినట్లు తెలిపారు. పుష్కరాల నాటికి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ఈ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపి అవసరమైన నిధులు విడుదల చేయాలని ముఖ్యమంత్రిని కోరినట్లు తెలియజేశారు .తాడేపల్లిగూడెం నియోజకవర్గం లో పుష్కరాల సందర్భంగా ముత్యాలమ్మ అమ్మవారి దేవస్థానం, రామలింగేశ్వర స్వామి దేవస్థానం కుంచనపల్లి, రామలింగేశ్వర స్వామి దేవస్థానం బోడపాడు, గుబ్బలమ్మ అమ్మవారి దేవస్థానం ముదునూరు, సీతారామ స్వామి వారి దేవస్థానం బి కొండేపాడు, విశ్వేశ్వర స్వామి దేవస్థానం బి, కొండేపాడు, వేణుగోపాల స్వామి దేవస్థానం దండగర, వీరేశ్వర స్వామి దేవస్థానం కొంద్రుపోలు,వీరేశ్వర స్వామి దేవస్థానం పెద్ద తాడేపల్లి , మల్లేశ్వర స్వామి దేవస్థానం జగన్నాధపురం, వేణుగోపాల స్వామి వారి దేవస్థానం ఆరుళ్ల, మహాలక్ష్మి మహాకాళి అమ్మవార్ల దేవస్థానం పెంటపాడు, జనార్ధన స్వామి దేవాలయం పడమర విప్పరు, బాల వెంకటేశ్వర స్వామి దేవస్థా తాళ్ల ముదునూరు పాడు, లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం తాడేపల్లిగూడెం, శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థానం ప్రత్తిపాడు వై జంక్షన్, బలుసులమ్మ అమ్మవారి దేవస్థానం తాడేపల్లిగూడెం, ఈ దేవాలయాల అభివృద్ధి కి నిధులు మంజూరు చేయవలసిందిగా ముఖ్యమంత్రి ని కోరినట్లు ఎమ్మెల్యే తెలియజేశారు. టిడ్కో కాలనీలో వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి రూ. 2 కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశానని తెలిపారు. ప్రభుత్వం రూపొందించిన పి4 విధానంలో, ప్రజల భాగస్వామ్యంతో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి కి వివరించానని తెలిపారు. మారంపల్లిలో రూ.60లక్షల తో రహదారి నిర్మాణం, జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో రూ.2కోట్లతో క్రీడా ప్రాంగణం అభివృద్ధి, 56మంది దివ్యాంగులకు రూ. 3వేలు చొప్పున ప్రతినెలా ఎమ్మెల్యే సొంత నిధులు అందించటం, రూ.75లక్షలతో స్విమ్మింగ్ పూల్ నిర్మాణం, రూ. 2.55కోట్ల తో జూనియర్ కళాశాల భవన నిర్మాణం, రూ. 60లక్షలతో ఇండోర్ స్టేడియం నిర్మాణం తదితర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడం పట్ల ముఖ్యమంత్రి హర్షం వ్యక్తం చేసి, అభినందించారని ఎమ్మెల్యే వివరించారు.

# సోకులేరు వాగు ఘటన బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వడ్డీ రఘురామ్ నాయుడు

## రూ.25 వేల ఆర్థిక సాయం, అన్నివిధాలుగా అండగా ఉంటానని భరోసానిచ్చిన వడ్డీ రఘురామ్ నాయుడు

తాడేపల్లిగూడెం ప్రతినిధి జులై 30 (ప్రజా వీక్షణం)

తాడేపల్లిగూడెం మండలంలోని వీరంపాలెం గ్రామానికి చెందిన పెండం బాబి, కళ్యాణ్‌లు పోలవరం జిల్లా చింతూరు మండలంలోని సోకులేరు వాగులో పడి దుర్మరణం చెందిన ఘటన పట్ల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తాడేపల్లిగూడెం నియోజకవర్గ సమన్వయకర్త వడ్డీ రఘురామ్ నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వారి నివాసానికి గురువారం వడ్డీ రఘురామ్ నాయుడు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అంత్యక్రియలు, ఇతర కార్యక్రమాల నిర్వహణ కోసం తన వంతు సహాయంగా రూ.25 వేలు ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వడ్డీ రఘురామ్ నాయుడు మాట్లాడుతూ ఇద్దరు యువకుల అకాల మరణం అత్యంత విషాదకరమని,ఈ క్లిష్ట సమయంలో బాధిత కుటుంబాలకు తాను అన్ని వేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ఈ తీరని లోటును భరించే మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# పార్టీ బలోపేతం కోసం కృషి చేయండి .. ఎమ్మెల్యే సోదరుడు భాస్కర్ రెడ్డి

దేవరకద్ర జులై 30 ప్రజా వీక్షణం

కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసము ప్రతి ఒక్కరు కూడా కృషి చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నది అని ఎమ్మెల్యే సోదరుడు భాస్కర్ రెడ్డి అన్నారు. గురువారము మండల పరిధిలోని గద్దెగూడం గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే సోదరుడు జి. భాస్కర్ రెడ్డి, దేవరకద్ర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భూనేటి అంజల్ రెడ్డి, పాల్గొని కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో ప్రతి కార్యకర్త చురుకుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో గద్దెగూడెం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ ఉప సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





# కొయ్యలగూడెం పట్టణంలో ఘనంగా 'ఇంటింటికి తెలుగుదేశం' ప్రచారం...

## ఉత్సాహంగా పాల్గొన్న 212వ బూత్ ఇంచార్జీ, ఏలూరు పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షురాలు ఆకుల అరుణ కుమారి

### ప్రజల వద్దకే సంక్షేమ పథకాలు..లి ఇంటింటికీ తిరిగి సమస్యలు తెలుసుకున్న టీడీపీ నేతలు

కొయ్యలగూడెం జులై 30 (ప్రజా వీక్షణం)

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, పోలవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కన్వీనర్ మరియు ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు మార్గదర్శకాలకు అనుగుణంగా కొయ్యలగూడెం పట్టణంలో ప్రజా సంక్షేమ కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా పట్టణంలోని 212వ బూత్ పరిధిలో ప్రతిష్టాత్మకంగా 'ఇంటింటికి తెలుగుదేశం' (డోర్-టు-డోర్) కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 212వ బూత్ ఇంచార్జీ మరియు ఏలూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షురాలు ఆకుల అరుణ కుమారి స్వయంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరిస్తూ, ఇంటింటికి తిరిగి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి తక్షణమే స్పందిస్తామని ఈ సందర్భంగా ఆమె ప్రజలకు భరోసా కల్పించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న ప్రభుత్వ విధానాలకు ప్రజల నుండి అపూర్వ స్పందన లభిస్తోందని నాయకులు పేర్కొన్నారు. అలాగే ప్రజల భాగస్వామ్యంతో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి, ప్రభుత్వ సంక్షేమ ఫలాలు



అర్హులందరికీ చేరవేయడమే లక్ష్యంగా ఈ డోర్-టు-డోర్ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది అని అరుణ కుమారి తెలిపారు.

# టీ నర్సాపురం లో చర్చి ప్రారంభోత్సవంలో ఘనంగా పాల్గొన్న పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మరియు ఏ ఎం సీ డైరెక్టర్ జట్లా సత్యనారాయణ

టీ. నర్సాపురం జులై 30(ప్రజా వీక్షణం)

ఏలూరు జిల్లా టీ. నర్సాపురం మండలం గ్రామపంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మించిన చర్చి ప్రారంభోత్సవ వేడుక అత్యంత వైభవంగా జరిగింది. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో పోలవరం శాసనసభ్యులు (జనసేన ఎమ్మెల్యే) చిర్రి బాలరాజు మరియు జనసేన ఏఎంసీ (ఏ ఎం సీ ) డైరెక్టర్ జట్లా సత్యనారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొని సందడి చేశారు. చర్చి కమిటీ సభ్యులు, స్థానిక క్రైస్తవ సోదరులు మరియు గ్రామ ప్రజలు వారికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థనల్లో వారు పాల్గొని దైవ ఆశీస్సులు పొందారు. అనంతరం నిర్వహించిన అభినందన సభలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మరియు జట్లా సత్యనారాయణ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. సభలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ.. అన్ని వర్గాలు, మతాల ప్రజలు కలిసికట్టుగా ఉంటూ పరస్పర సహకారంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. చర్చి



ప్రారంభోత్సవ వేడుకలో పాలుపంచుకోవడం ఎంతో సంతోషంగా ఉందని, ఈ ప్రాంత ప్రజలందరిపై దైవాశీస్సులు ఎప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నామని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. అలాగే, జనసేన ఏఎంసీ డైరెక్టర్ జట్లా సత్యనారాయణ మాట్లాడుతూ.. సమాజంలో శాంతియుత వాతావరణం నెలకొనడానికి ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. జనసేన పార్టీ ఎప్పుడూ ప్రజల పక్షాన నిలబడి, అన్ని వర్గాల సంక్షేమం కోసం పాటుపడుతుందని స్పష్టం చేశారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజు



వెన్నంటి ఉంటూ నిరంతరం ప్రజలకు సేవ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక జనసేన నాయకులు, కార్యకర్తలు, చర్చి పాస్టర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# భారీ వర్షాలు కురిసే ఛాన్స్

## ఆదిలాబాద్, జగిత్యాలకు రెడ్ అలర్ట్

హైదరాబాద్,జూలై30( ప్రజా వీక్షణం):

తీవ్ర వాయుగుండం నేపథ్యంలో రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్‌లోని వాతావరణ కేంద్రం గురువారం వెల్లడించింది. ఉమ్మడి ఆదిలాబాద్‌తోపాటు జగిత్యాల జిల్లాకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఈ రెండు జిల్లాల్లో అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఉమ్మడి నిజామాబాద్‌తోపాటు రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. దీంతో ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్‌తోపాటు హనుమకొండ, జనగాం, వరంగల్, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వివరించింది. ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. రాష్ట్రంలోని మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్‌లోని వాతావరణ కేంద్రం ప్రకటించింది.

# గిరిజన గ్రామం సాలిగూడెం సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేను కలిసిన గిరిజన ఆదివాసి నాయకులు పూసం అంజిబాబు !

## గిరిజన గ్రామస్తులతో కలిసి ఎమ్మెల్యే కి వినతిపత్రం అందజేసిన పూసం అంజిబాబు

పోలవరం, జూలై 30:(ప్రజా వీక్షణం )

ఏలూరు జిల్లా, టీ. నరసాపురం మండలం, పోలవరం నియోజకవర్గం పరిధిలోని తిరుమలదేవిపేట పంచాయతీ సాలిగూడెం గిరిజన గ్రామానికి చెందిన ఆదివాసీలు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలపై కూటమి సీనియర్ నాయకులు మరియు గిరిజన ఆదివాసి నాయకులు పూసం అంజిబాబు నేరుగా రంగంలోకి దిగారు. గ్రామానికి చెందిన బాధితులను, గ్రామస్తులను స్వయంగా తన వెంటబెట్టుకుని పోలవరం నియోజకవర్గం ఎమ్మెల్యే ని కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు.ఈ సందర్భంగా సాలిగూడెం గ్రామం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తూ గ్రామస్తులు, పూసం అంజిబాబు వివిధ అంశాలపై వినతిపత్రం అందజేశారు. బి .టి. రోడ్డు వసతి : సాలిగూడెం గ్రామం నుండి ఎర్ర కాలువ వరకు ఉన్న 6 కిలోమీటర్ల రోడ్డు సరిగా లేకపోవడంతో గర్భిణులు, రోగులు ఆసుపత్రికి వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఈ రోడ్డును మంజూరు చేయాలని కోరారు. తాగునీరు మరియు వాటర్ ట్యాంక్ : ఊరిలో మంచి నీటి వసతి లేక ప్రజలు బడి పిల్లలు ఇబ్బంది పడుతున్నారని, గ్రామస్తుల దాహార్తిని తీర్చేందుకు సరిపడా తాగునీటి సౌకర్యం కల్పించి వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇళ్ల స్థలాలు మరియు గృహాలు: గ్రామంలో ఒకే ఇంట్లో రెండు కుటుంబాలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నాయని, ఇళ్లు లేని పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి పక్కా ఇళ్లు మంజూరు చేయాలని కోరారు.గ్రామస్తులు పడుతున్న కష్టాలను, వారి సమస్యలను సానుకూలంగా విన్న ఎమ్మెల్యే .. త్వరలోనే సాలిగూడెం సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. దశాబ్దాలుగా అలుముకున్న మౌలిక వసతుల కొరతకు త్వరలోనే తెరపడుతుందని, తమ సమస్యలు పరిష్కారమవుతాయని సాలిగూడెం గ్రామ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



# జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూలై 30 (ప్రజా వీక్షణం న్యూస్)

రాష్ట్రంలో వచ్చే ఐదు రోజు ల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా యం త్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించా రు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అవసరమైతే సురక్షి త ప్రాంతాలకు తరలించా లని, 24 గంటల కంట్రోల్ రూములు, ఎన్డీఆర్ఎఫ్-- ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉంచాలని సూచించారు. జిల్లా కలెక్టర్ చాహ త్ బాజ్‌పాయ్ అన్ని శాఖ లు సమన్వయంతో పని చేసి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించా రు. అత్యవసర పరిస్థితు ల్లో ప్రజలు 1800 425 1115 టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని సూచిం చారు.





# అభివృద్ధి--సంక్షేమానికి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం : ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

## నందిగామ పట్టణంలో ప్రజల ముంగిటకు రెండేళ్ల పాలన విజయాలు

## 9వ వార్డులో ఇంటింటా కరపత్రాల పంపిణీ

## ముక్కపాటి కాలనీలో ఘనంగా కూటమి ప్రభుత్వ "రెండేళ్ల నమ్మకం" కార్యక్రమం

నందిగామ, జులై 30 (ప్రజా వీక్షణం):

రాష్ట్రంలో అభివృద్ధితో పాటు సంక్షేమం కేవలం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య స్పష్టం చేశారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ పట్టణంలోని 9వ వార్డు ముక్కపాటి కాలనీలో గురువారం కూటమి నేతలతో కలిసి "అభివృద్ధి--సంక్షేమానికి రెండేళ్ల నమ్మకం" కార్యక్రమంలో భాగంగా ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు.కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో సాధించిన సంక్షేమ విజయాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ రూపొందించిన కరపత్రాలను ప్రతి ఇంటికీ తిరిగి ప్రజలకు అందజేశారు."ప్రజల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. గత పాలకుల నిర్వాకంతో సర్వనాశనమైన రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెట్టేందుకు విజనరీ లీడర్ చంద్రబాబు సమర్థవంతంగా పనిచేస్తున్నారు." అని తంగిరాల సౌమ్య తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రజలను నేరుగా కలుసుకుని, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, ప్రజలకు అందుతున్న ప్రయోజనాల గురించి అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అన్ని రంగాల్లో



వెనుకబడిపోయిందని, అభివృద్ధి పూర్తిగా కుంటుపడి ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారని ఆమె విమర్శించారు.రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మౌలిక వసతుల కల్పనకు, ఆర్థిక పునరుజ్జీవనానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. రాబోయే రోజుల్లో నవ్యాంధ్రప్రదేశ్‌ను మరింత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వం లో ప్రభుత్వం దూసుకు పోతోందని ఆమె ధీమా వ్యక్తం చేశారు.నందిగామ నియోజకవర్గ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల ఆశీస్సులతో నియోజకవర్గంలో మరిన్ని నూతన అభివృద్ధి కార్యక్ర మాలు చేపట్టి, నందిగామను అన్ని రంగాల్లోనూ అగ్రగామిగా నిలుపుతా మని హామీనిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు మరి యు భారీ సంఖ్యలో వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# అంగన్వాడీలోకి వరద నీరు.. చిన్నారుల భవిష్యత్తు ప్రశ్నార్థకం

## వర్షాలకు జలమయమైన అంగన్వాడీ కేంద్రం.. నిత్యావసర సరుకులు తడిసి నష్టం..

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జూలై 30 (ప్రజా వీక్షణం న్యూస్)

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం సరండి గ్రామపంచాయతీలోని అంగన్వాడీ కేంద్రం కురుస్తున్న ఎడతెరిపి వర్షాలకు దయనీయ పరిస్థితిని ఎదుర్కొంటోంది. వర్షపు నీరు భవనంలోకి చేరడంతో అంగన్వాడీ కేంద్రం మొత్తం జలమయ మైంది. చిన్నారులు విద్యాభ్యాసం, ఆటపాటలు, పోషకాహార కార్యక్రమా లు నిర్వహించాల్సిన గది నీటితో నిండిపోవడంతో కేంద్రం పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. ప్రభుత్వ బాలల సంక్షేమ పథకాల అమలుకు కేంద్ర బిందువుగా ఉండాల్సిన అంగన్వాడీ, ప్రస్తుతం వరద నీటిలో మునిగిపోయి ఉండటం స్థానికులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. వర్షపు నీటిని స్థానిక అంగన్వాడీ ఆయ మ్మ బిందెలతో ఎత్తిపోస్తున్న దృశ్యం గ్రామస్థుల హృదయాలను కలచివేసింది. చిన్నారులకు సేవలు అందించాల్సిన సిబ్బంది, నీరు తోడే పనిలో నిమగ్నం కావాల్సి రావడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని గ్రామస్థులు విమర్శిస్తున్నారు.ఈ సందర్భంగా గ్రామ పటేల్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొట్రాంగే మేంఘజి మాట్లాడుతూ.. సరండి గ్రామ అంగన్వాడీ భవనం ఎన్నో ఏళ్లుగా శిథిలావస్థలో కొనసాగుతోందని, ప్రతి వర్షాకాలంలో ఇదే పరిస్థితి ఎదురవుతున్నప్పటికీ సంబంధిత అధికారులు శాశ్వత చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. అంగన్వాడీ కేంద్రంలో నిల్వ ఉంచిన బియ్యం,



పప్పులు, నూనె, ఉప్పు, పిల్లలకు అందించే పోషకాహార పదార్థాలు, గుడ్లు, వంట సామగ్రి, విద్యా బోధనకు ఉపయోగించే పుస్తకాలు, ఆట వస్తువులు, ఫర్నిచర్ తదితర సామగ్రి వర్షపు నీటికి తడిసి పాడయ్యే ప్రమాదం ఏర్పడిందని తెలిపారు. ప్రభుత్వ నిధులతో కొనుగోలు చేసిన సామగ్రి సరైన రక్షణ లేక నష్టపోవడం విచారకరమన్నారు. వర్షపు నీరు నిల్వ ఉండటంతో అంగన్వాడీ కేంద్రంలో తీవ్రమైన దుర్వాసన వస్తోందని, తేమ కారణంగా గోడలు బలహీనపడుతున్నాయని, నేల జారుడుగా మారి పిల్లలు కిందపడే ప్రమాదం ఉందని గ్రామస్థులు చెబుతున్నారు. గోడలలో తేమ పెరగడం వల్ల ఎప్పుడైనా ప్లాస్టర్ ఊడిపోయే అవకాశం ఉందని, పైకప్పు లీకేజీలు మరింత ప్రమాదకరంగా మారాయని పేర్కొన్నారు. అదేవిధంగా, వర్షపు నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు,ఈగలు, విషపురుగులు, పాములు వంటి జీవులు అంగన్వాడీ కేంద్రంలోకి ప్రవేశించే ప్రమాదం ఉందని తెలిపారు. దీంతో డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు, చర్మవ్యాధులు వంటి అంటువ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులకు ప్రతిరోజూ అందించే వేడి భోజనం, గుడ్లు, పోషకాహారం పరిశు



భ్రమైన వాతావరణంలో తయారు కావాల్సి ఉండగా, ప్రస్తుతం నీటితో నిండిన భవనంలో అలాంటి పరిస్థితులు లేకపోవడం బాలల ఆరోగ్యానికి ముప్పుగా మారిందని మేంఘజి పేర్కొన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను అంగన్వాడీకి పంపేం దుకు వెనుకంజ వేస్తున్నారని తెలిపా రు. ప్రభుత్వం బాలల ఆరోగ్యం, పోషకాహారం, ప్రాథమిక విద్య కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని, కానీ గ్రామీణ ప్రాంతాల్లో అంగన్వాడీ భవనాల పరిస్థితి మాత్రం అత్యంత దయనీయంగా ఉందని ఆయన విమర్శించారు. కాగితాలపై అభివృద్ధి చూపించడం కాకుండా, గ్రామాల్లోని వాస్తవ పరిస్థితులను పరిశీలించి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అంగన్వాడీ భవనం చుట్టూ సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల వర్షపు నీరు నేరుగా భవనం ఓలోకి ప్రవహిస్తోందని గ్రామస్థులు తెలిపారు. వెంటనే డ్రైనేజీ కాలువలు నిర్మించడం, భవనం స్థాయిని ఎత్తు చేయడం, వర్షపు నీరు చేరకుండా రక్షణ గోడ ఏర్పాటు చేయడం వంటి శాశ్వత చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గ్రామ పటేల్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొట్రాంగే మేంఘజి మాట్లాడుతూ చిన్నారుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదు. అధికారులు వెంటనే అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించాలి. దెబ్బతిన్న నిత్యావసర సరుకులను వెంటనే భర్తీ చేయాలి. అత్యవసర నిధులు మంజూరు చేసి తాత్కాలిక మరమ్మతులు చేపట్టడంతో పాటు, శాశ్వత పరిష్కారంగా అన్ని సౌకర్యాల తో కూడిన నూతన అంగన్వాడీ భవనాన్ని నిర్మించాలి అని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఐసీడీఎస్ అధికారులు, మండల అభివృద్ధి అధికారులు, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నివేదిక సమర్పించాలని, భవనం నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. పిల్లల భవిష్యత్తు, ఆరోగ్యంతో రాజీ పడకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రామస్థులు కూడా చిన్నారుల కోసం నడుస్తున్న అంగన్వాడీ కేంద్రం వరద నీటిలో మునిగిపోవడం అత్యంత దురదృష్టక రమని పేర్కొంటూ, రేపటి పౌరులైన చిన్నారులకు సురక్షితమైన, పరిశుభ్రమైన, శాశ్వత అంగన్వాడీ భవనం అందించడం ప్రభుత్వ బాధ్యత. అధికారులు ఇకనైనా స్పందించి సరండి గ్రామానికి నూతన అంగన్వాడీ భవనం మంజూరు చేసి నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించాలి అని విజ్ఞప్తి చేశారు.

# దర్భగూడెంలో అంగరంగ వైభవంగా భూలక్ష్మి అమ్మవారికి ఆషాడ సారే సమర్పణ!

జీలుగుమిల్లి జులై 30(ప్రజా వీక్షణం)

ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలంలోని దర్భగూడెం గ్రామ దేవత శ్రీ భూలక్ష్మి దేవి అమ్మవారికి గ్రామస్తులు ఆషాడ సారేను అత్యంత భక్తిశ్రద్ధలతో సమర్పించారు.అంగరంగ వైభవంగా సాగిన ఈ వేడుకలో గ్రామ మహిళలు మేళతాళాలు, కోలాటాలు మరియు మంగళవాయిద్యాల నడుమ ఉత్సాహంగా పాల్గొని, గ్రామంలోని అన్ని దేవాలయాలకు సారేను ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా దేవాలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ అర్చకులు త్రినాధ శర్మ మాట్లాడుతూ.. ప్రతి



సంవత్సరం ఆనవాయితీగా భూలక్ష్మి అమ్మవారికి ఈ సారే సమర్పించడం జరుగుతుందని తెలిపారు. గ్రామం



సుభిక్షంగా వర్ధిల్లాలని, పాడిపంటలు సమృద్ధిగా పండి ప్రజలందరికీ అష్టైశ్వర్యాలు కలగాలని ఆకాంక్షిస్తూ అమ్మవారికి ఈ సారే సమర్పించినట్లు ఆయన వెల్లడించారు.ఈ కార్యక్రమం లో గ్రామ పెద్దలు, యువకులు మరియు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

# ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పోలవరం నియోజకవర్గంలో కొనసాగుతున్న కూటమి ఇంటింటి ప్రచారం!





### ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను ఆరా తీసిన ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు!

పోలవరం మండలం, జులై 30 (ప్రజా వీక్షణం)

పోలవరం మండలం ఎల్.ఎన్.డి. పేట గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ మరియు పోలవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ బొరగం శ్రీనివాసులు ముఖ్య అతిథిగా విచ్చేసి ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని ప్రతీ ఇంటికీ స్వయంగా వెళ్లిన ఆయన, ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, పెన్షన్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం తదితర లబ్ధి వివరాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఆరా తీస్తూ ప్రజలకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ గుబ్బ రాంబాబు, గ్రామ కమిటీ అధ్యక్షులు ఇల్ల సత్యనారాయణ, వేణు గారులతో పాటు చిక్కాల వెంకటేష్, కతవ వెంకటేష్, మైనం రాంబాబు, జొన్నాడ సుబ్బారావు, ఇళ్ళ సాయి, ఇల్ల నాగబాబు, ఆసిపోయిన రమేష్, ఎల్లా చిన్న సత్యనారాయణ, దాసరి శీను, చిక్కాల శ్రీను, గంగుల నాగు, జల్లేపల్లి జితేంద్ర, మడకం లక్ష్మి, నల్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# తెలుగుదేశం ప్రజా చైతన్య కార్యక్రమంలో ఘనంగా 'డోర్ టూ డోర్ '.

### నాయకత్వం వహించిన మండల క్లస్టర్ ఇంచార్జ్, సొసైటీ చైర్మన్ జోనుబోయిన సోంబాబు!

టి. నరసాపురం, జులై 30:(ప్రజా వీక్షణం)

ఏలూరు జిల్లా టి. నరసాపురం మండలం, టి. నరసాపురం గ్రామ పంచాయతీలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో 'డోర్ టూ డోర్' కార్యక్రమం అత్యంత వైభవంగా మరియు విజయవంతంగా నిర్వహించబడింది. మండల క్లస్టర్ ఇంచార్జ్ మరియు సొసైటీ చైర్మన్ జోనుబోయిన సోంబాబు గారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా జోనుబోయిన సోంబాబు ఇంటింటికీ తిరిగి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. వారి సమస్యలను శ్రద్ధగా ఆలకించి, ప్రభుత్వం నుంచి అందాల్సిన సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని, నిరంతరం ప్రజలక్ష్యాల కోసం పోరాడుతామని ఆయన ఈ సందర్భంగా భరోసా కల్పించారు. గ్రామంలో ప్రతి గడపకూ తిరిగి పార్టీ విధానాలను వివరించడంతో స్థానికుల నుంచి అపూర్వ స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు కొనకోళ్ల మోహనరావు, రాచబంటు వేములయ్య, యూనిట్ ఇంచార్జ్ కిలారు సంభాశివరావు, సొసైటీ డైరెక్టర్ మోదుగు రామారావు తో పాటు పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.



# స్వచ్ఛమైన ఏలూరు లక్ష్యంగా వాయు కాలుష్య నియంత్రణకు పటిష్ట చర్యలు:...జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ఆదేశం





### కాలం చెల్లిన వాహనాల సీజ్: కాలుష్య కట్టడికి కలెక్టర్ కె.వెట్రిసెల్వి కఠిన ఆదేశాలు

### పెట్రోల్, డీజిల్ అమ్మకాలుపై విస్తృతంగా తనిఖీలు జరపాలి, నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తీసుకోవాలి.

ఏలూరు జులై 30(ప్రజా వీక్షణం)

ఏలూరు నగరంలో వాయు కాలుష్య నియంత్రణకు పటిష్టమైన ప్రణాళికను అమలు చేసి, నిర్దేశిత లక్ష్యాలను అధిగమించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో కాలుష్య నియంత్రణా మండలి, నగరపాలక సంస్థ, రవాణా, పోలీసు, అటవీ, పరిశ్రమలు తదితర సంబంధిత అధికారులతో నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ (ఎన్.సి.ఏ.పి) జిల్లా స్థాయి అమలు కమిటీ సమావేశం జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షతన నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ఎన్.సి.ఏ.పి 2024-25, 2025-26 నిధులతో చేపట్టిన పనులు, చేపట్టబోయే పనులపై సమీక్ష జరిపి, పెండింగ్ లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని నగరపాలక సంస్థ, పోలీసు శాఖల అధికారులను ఆమె ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ ఏలూరు నగర వాసులకు స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నగర ప్రజలకు స్వచ్ఛమైన గాలిని అందించేందుకు అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి, అందుకు అనుగుణంగా తగిన చర్యలు చేపట్టాలన్నారు. నగరంలో ఎక్కడా చెత్తకుప్పలు లేకుండా పరిశుభ్రంగా ఉండేలా చూస్తూ, పొడి, తడి చెత్తను వేర్వేరుగా అందజేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలని పిలుపునిచ్చారు. చెత్తను, వ్యర్థ పదార్థాలను ఎవరూ తగలబెట్టకుండా పక్కా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నగరంతో పాటు రూరల్ ప్రాంతాల్లో గల ప్రైవేట్ పెట్రోల్ బంకులను తనిఖీ చేసి పెట్రోల్, డీజిల్ నాణ్యతను పరీక్షించాలని, నాణ్యత లోపిస్తే వెంటనే సీజ్ చేసి పోలీసు కేసులు నమోదు చేయాలని స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ పరిధిలో గ్రీన్ వాహనాలను ఏర్పాటు చేయాలని, అదేవిధంగా బ్యాటరీ వాహనాలు, తక్కువ దూరాలకు సైకిల్ మీద ప్రయాణించేలా ప్రజలకు రవాణా శాఖ అధికారులు అవగాహన కల్పించాలన్నారు. గాలిలో దుమ్ము, ధూళి శాతాన్ని మిషన్ ద్వారా ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించి, తదనుగుణంగా తగు నివారణా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కాలం చెల్లిన వాహనాలను గుర్తించి సీజ్ చేయాలని, అటువంటి కేసుల పట్ల క్షేత్రస్థాయిలో పరిశీలన చేసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వాహనాలు మంచి కండిషన్ లో ఉండేలా, నడిపే డ్రైవర్లకు తప్పనిసరిగా లైసెన్సులు ఉండేలా చూడాలని, వారికి క్రమం తప్పకుండా అవగాహన సదస్సులు, వైద్య పరీక్షలు నిర్వహించాలని జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు.

# ఏపీగుంటలో ఘనంగా తెలుగుదేశం పార్టీ "డోర్ టూ డోర్" కార్యక్రమం!

### బూసిబాబు, వెంకటరత్నం, రాంబాబు ఆధ్వర్యంలో ఇంటింటికీ ప్రచారం!

టి. నరసాపురం జులై 30(ప్రజా వీక్షణం)

ఏలూరు జిల్లా టి. నరసాపురం మండలం ఏపీగుంట గ్రామ పంచాయతీలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో "డోర్ టూ డోర్" కార్యక్రమం అత్యంత వైభవంగా మరియు ఉత్సాహంగా నిర్వహించడం జరిగింది. ఏపీగుంట గ్రామ టీడీపీ అధ్యక్షులు సాధనల బూసిబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు కాల్నిడి వెంకటరత్నం మరియు కాల్నిడి రాంబాబు ప్రత్యేక అతిథులుగా పాల్గొని, గ్రామంలోని ప్రతీ ఇంటిని సందర్శించారు. ఈ ఇంటింటి ప్రచార కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతీ ఇంటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, నాయకులు, కార్యకర్తల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.



# విద్యార్థి ఆత్మహత్యపై సమగ్ర విచారణ జరపాలి : పీడీఎస్‌యూ డిమాండ్

కామవరపుకోట జులై 30 (ప్రజా వీక్షణం)



ఏలూరు జిల్లా కామవరపుకోట మండలం రావికంపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుకుంటున్న కునుసోతు బాల సాయి సుబ్రహ్మణ్యం ఆత్మహత్యపై సమగ్ర న్యాయ విచారణ జరపాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) జిల్లా ప్రధాన కార్యదర్శి బన్నె వినోద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఈ విద్యాసంవత్సరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో చేరి రెండు నెలలు గడవకముందే, జూలై 24వ తేదీన ఎవరూ లేని సమయంలో జంగారెడ్డిగూడెం ఇంట్లో ఆత్మహత్య చేసుకుని చనిపోవడం చాలా బాధాకరమని ఆయన పేర్కొన్నారు. విద్యార్థి ఆత్మహత్యకు పాఠశాల ఉపాధ్యాయుల వేధింపులే కారణమని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషాద ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చిందని తెలిపారు. కావున, ఈ విద్యార్థి ఆత్మహత్యపై ప్రభుత్వం మరియు సంబంధిత అధికారులు సమగ్రంగా న్యాయ విచారణ జరపాలని పీడీఎస్‌యూ తరఫున డిమాండ్ చేశారు.

# జంగారెడ్డిగూడెం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో విజిలెన్స్ కమిటీ సభ్యులు పోల్నాటి బాబ్జి ఆకస్మిక తనిఖీ!





జంగారెడ్డిగూడెం జులై 30(ప్రజా వీక్షణం)

ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం పట్టణం స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో విజిలెన్స్ కమిటీ సభ్యులు, ప్రస్తుత జెడ్పీటిసి పోల్నాటి బాబ్జి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అందుబాటులో ఉన్న వసతులు, భోజన నాణ్యత, సానిటరీ అంశాలు మరియు వివిధ రకాల సదుపాయాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠశాలలో విద్యా ప్రమాణాలు, క్రమశిక్షణ, శుభ్రత (నీట్నెస్) మరియు ఉపాధ్యాయ సిబ్బంది పనితీరు అన్ని విధాలుగా అత్యంత బాగున్నాయని, ఇక్కడి వాతావరణం ఎంతో తృప్తికరంగా ఉందని బాబ్జి ప్రశంసించారు. గడిచిన విద్యా సంవత్సరంలో పదవ తరగతి మరియు ఇంటర్మీడియట్ పరీక్షలలో పాఠశాల అత్యుత్తమ ఉత్తీర్ణత శాతం సాధించినందుకు గాను... ప్రిన్సిపాల్ జి.వి. లలిత కుమారి, వైస్ ప్రిన్సిపాల్ పి. విజయభారతి, జె.ఎల్. పి. అరుణకుమారి మరియు ఉపాధ్యాయ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఆకస్మిక తనిఖీ అనంతరం ఆయన విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. వండిన భోజనం చాలా రుచికరంగా ఉందని ఈ సందర్భంగా వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పోల్నాటి బాబ్జితో పాటు జంగారెడ్డిగూడెం మానవత మండల అధ్యక్షులు తన్నీరు రామకృష్ణ, కన్స్యూమర్ రైట్స్ ఏపీ స్టేట్ చైర్మన్ కలపాల ప్రసాద్, పడవల ప్రసాద్, మనెల్లి రమేష్, డి.జె. చరణ్, దంసెల్లి రాంకి తదితరులు పాల్గొన్నారు.

# ఏలూరు జిల్లాలో పెద్దపులి భీభత్సం.. రెండు ఆవుల మృతి.....పులిని జూ పార్క్‌కు తరలించాలంటూ రైతులు ఆందోళన!





### కొయ్యలగూడెం మండలం మంగపతిదేవిపేటలో అర్ధరాత్రి కలకలం.. అధికారుల తీరుపై తీవ్ర నిరసన

**ఏలూరు జిల్లా: జులై 30(ప్రజా వీక్షణం)**

ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం మంగపతిదేవిపేట శివారు ప్రాంతంలో పెద్దపులి సంచారం ఒక్కసారిగా కలకలం సృష్టించింది. బుధవారం అర్ధరాత్రి సమయాన పశువులను కట్టేసినా ప్రాంతాలోకి ప్రవేశించిన పులి రెండు ఆవులను అత్యంత క్రూరంగా హతమార్చింది .స్థానిక సమాచారం మేరకు గ్రామానికి చెందిన కొండా వీరస్వామి, తేలే వెంకటేశ్వర్లుకు చెందిన పశువులను పులి టార్గెట్ చేసింది. ఒక ఆవును సగం వరకు తిని, మరో ఆవును చంపి అక్కడే వదిలేసి వెళ్లింది. ఉదయాన్నే దైనందిన పనుల్లో భాగంగా పొలాలకు వెళ్లిన రైతులు ఈ దారుణ దృశ్యాన్ని చూసి హడలిపోయారు. వెంటనే తోటి రైతులకు, అధికారులకు సమాచారం అందించడంతో విషయం గ్రామస్థులం దరికీ తెలిసింది .సంఘటన గురించి సమాచారం అందుకున్న వెంటనే అటవీశాఖ అధికారులు హుటాహుటిన మంగపతిదేవిపేట చేరుకున్నారు. రంగంలోకి దిగి పులి అడుగుల ఆధారంగా గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో పులి సంచరిస్తుండటంతో స్థానిక ప్రజలు, రైతులు తీవ్ర భయాందోళనలకు లోనవుతున్నారు. ఎవరూ ఒంటరిగా పొలాలకు వెళ్లవద్దని, అప్రమత్తంగా ఉండాలని ఫారెస్ట్ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.ఇదిలా ఉండగా, అటవీశాఖ అధికారుల తీరుపై రైతులు, స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికీ ఈ పులి లెక్కలేనన్ని జంతువులను బలి తీసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు.గతంలో అధికారులు ఈ పులిని బంధించి దూరంగా అడవిలో వదిలేసినప్పుడు పులికి జీపీఎస్ ట్రాకర్ కూడా అమర్చామని ఎప్పటికప్పుడు గమని స్తూ ఉంటామని ఎవరికీ ఎలాంటి భయం అవసరం లేదని, ఏ జంతువు కూ హాని జరగదని గొప్పలు చెప్పారని రైతులు గుర్తుచేశారు. కానీ, అధికారులు చెప్పిన మాటలన్నీ నీటిమూటలే అయ్యాయని, మళ్లీ తమ పశువుల ప్రాణాలు బలిపశువులయ్యాయని వాపోయారు. ఇకనైనా ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా, ఈసారైనా పులిని శాశ్వతంగా బంధించి కనీసం ఏదైనా జూ పార్క్ కు తరలించాలని వారు ప్రభుత్వానికి, అటవీశాఖకు డిమాండ్ చేస్తున్నారు.

# ఉపాధ్యాయుల వేధింపులు తాళలేక పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య!

### ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన దారుణం

### ఎమ్మార్వో సమక్షంలో మృతదేహం వెలికితీత .. పోస్టుమార్టం నిర్వహణ!

**జంగారెడ్డిగూడెం / కామవరపుకోట:జులై 30(ప్రజా వీక్షణం)**



పాఠాలు నేర్పించి విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దాల్సిన ఉపాధ్యాయుల వేధింపులే ఆ విద్యార్థి నిండు ప్రాణాన్ని బలితీసుకున్నాయి. గురువుల మానసిక వేధింపులు తాళలేక ఓ పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న తీవ్ర విషాదక ర సంఘటన ఏలూరు జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తెలంగాణ రాష్ట్రం దమ్మపేట గ్రామానికి చెందిన కునుసోతు వెంకటేశ్వరరావు, పద్మ దంపతులు బతుకు తెరువు కోసం జంగారెడ్డి గూడెంలో నివాసం ఉంటున్నారు. వీరి కుమారుడు కునుసోతు బాల సాయి సుబ్రహ్మణ్యం కామవర పుకోట మండలం రవికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్పీ హెచ్ ఎస్ ) లో పదవ తరగతి చదువుతున్నాడు. అయితే గత జూలై 24న జంగారెడ్డిగూడెంలోని తన తల్లిదండ్రుల నివాసం వద్ద బాల సాయి సుబ్రహ్మణ్యం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు (హెచ్ ఎం ) తో పాటు పలువురు ఉపాధ్యాయులు పెట్టిన తీవ్ర వేధింపుల వల్లే తమ కుమారుడు మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తల్లిదండ్రులు ఆరోపిస్తూ జంగారెడ్డిగూడెం పోలీసులకు ఫిర్యాదు చేశారు.తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన జంగారెడ్డిగూడెం పోలీసులు దర్యాప్తు చేపట్టి, స్థానిక ఎమ్మార్వో సమక్షంలో విద్యార్థి మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు. తమ కుమారుడి మరణానికి కారణమైన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మరియు సంబ ంధిత ఉపాధ్యాయులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుని, తమ కుటుంబానికి న్యాయం చేయాలని కన్నీరుమున్నీరుగా విలపిస్తూ విద్యార్థి తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

# చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ప్రమాదకర గుంత .. రోగుల అష్టకష్టాలు !




### - ప్రధాన ద్వారం వద్ద డ్రైనేజ్‌పై భారీ గొయ్యి.. భయాందోళనలో ప్రజలు

### - పట్టించుకోని అధికారులు.. ఎప్పుడేం జరుగుతుందోనని ఆందోళన

**- చింతలపూడి జులై 30(ప్రజా వీక్షణం)**

ఏలూరు జిల్లా చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి బంధువులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆసుపత్రి ప్రధాన ద్వారం వద్దే డ్రైనేజ్‌పై పెద్ద గొయ్యి ఏర్పడటంతో రాకపోకలు సాగించడం నరకప్రాయంగా మారింది.ఆసుపత్రి మెయిన్ గేట్ ఎదురుగా డ్రైనేజ్ వ్యవస్థ కుంగిపోయి పెద్ద గుంత ఏర్పడింది. దీనివల్ల ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, చిన్నారులు, అత్యవసర చికిత్స కోసం వచ్చే రోగులు ఆసుపత్రిలోకి ప్రవేశించడానికి తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో వచ్చే వారికి ఈ గుంత అస్సలు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.ఈ భారీ గుంత కారణంగా ఆసుపత్రి వైపు వచ్చే అంబులెన్సులు, ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. స్థానికుల కథనం ప్రకారం, వాహనాలు అదుపుతప్పి ఎప్పుడైనా పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.సమస్య తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ, ఇప్పటివరకు సంబంధిత అధికారులు కనీసం స్పందించకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, తక్షణమే డ్రైనేజ్‌ను మరమ్మతు చేయాలని... ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, రోగులు కోరుతున్నారు.

# పెరుగుతున్న వృద్ధ జనాభా...

# భారత్ సిద్ధమేనా?

**-- సి.హెచ్. ప్రతాప్**

భారత్‌ను ప్రపంచం ఇప్పటికీ యువశక్తికి ప్రతీకగా చూస్తోంది. అయితే ఈ చిత్రంలో నిశ్శబ్దంగా ఒక పెద్ద మార్పు చోటుచేసుకుంటోంది. జననాల రేటు క్రమంగా తగ్గడం, ఆయుర్దాయం గణనీయంగా పెరగడంతో దేశంలో వృద్ధుల సంఖ్య వేగంగా పెరుగుతోంది. ఒకప్పుడు కుటుంబానికి ఆధారంగా నిలిచిన వృద్ధులు, నేడు సమాజం, ఆర్థిక వ్యవస్థ, ఆరోగ్య రంగాల ముందున్న కొత్త సవాలుగా మారుతున్నారు. రానున్న రెండు దశాబ్దాల్లో భారత జనాభా నిర్మాణంలో సంభవించనున్న ఈ మార్పు దేశ విధానాలను పూర్తిగా మార్చివేసే స్థాయిలో ఉండబోతోంది.ఐక్యరాజ్యసమితి జనాభా నిధి (ఖచీఖీూా) 'ఇండియా ఏజింగ్ రిపోర్ట్--2023' ప్రకారం, ప్రస్తుతం భారత్‌లో 60 సంవత్సరాలు దాటిన వారి సంఖ్య 14.9 కోట్లకు చేరుకుంది. ఇది మొత్తం జనాభాలో 10.5 శాతం. 2036 నాటికి ఈ సంఖ్య 22.7 కోట్లకు (15 శాతం), 2050 నాటికి 34.7 కోట్లకు, అంటే దాదాపు ప్రతి ఐదుగురిలో ఒకరు వృద్ధులే అయ్యే స్థాయికి చేరుకుంటుంది. మరోవైపు స్వాతంత్ర్యానంతరం సుమారు 32 సంవత్సరాలుగా ఉన్న సగటు ఆయుర్దాయం, ప్రస్తుతం 70 సంవత్సరాలకు పైగా పెరిగింది. ఇది వైద్యరంగ అభివృద్ధికి నిదర్శనమే అయినప్పటికీ, దానికి అనుగుణంగా సామాజిక, ఆర్థిక వ్యవస్థలు సిద్ధంగా ఉండాల్సిన అవసరాన్ని కూడా స్పష్టం చేస్తోంది.వృద్ధుల సంఖ్య పెరగడం అంటే కేవలం ఆరోగ్య సేవల అవసరం పెరగడం మాత్రమే కాదు. దేశ ఆర్థిక నిర్మాణమే మారిపోతుంది. పని చేసే వయస్సు గల జనాభా వాటా క్రమంగా తగ్గుతుండగా, పెన్షన్లు, ఆరోగ్య సేవలు, సామాజిక భద్రతపై ప్రభుత్వ వ్యయం భారీగా పెరుగుతుంది. మధుమేహం, రక్తపోటు, గుండె జబ్బులు, క్యాన్సర్, మతిమరుపు వంటి దీర్ఘకాలిక వ్యాధుల చికిత్సకు మరింత పెట్టుబడి అవసరమవుతుంది. దీనివల్ల ప్రభుత్వ ఆర్థిక వనరులపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది.సామాజికంగా పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారుతోంది. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ వేగంగా క్షీణిస్తోంది. ఉపాధి కోసం యువత నగరాలకు, విదేశాలకు వలస వెళ్తుండటంతో గ్రామాల్లోనూ, పట్టణాల్లోనూ అనేక మంది వృద్ధులు ఒంటరి జీవితాన్ని గడుపుతున్నారు. మానసిక ఆందోళన, ఒంటరితనం, ఆర్థిక అసురక్షిత భావం, వృద్ధులపై నిర్లక్ష్యం, వేధింపులు వంటి సమస్యలు పెరుగుతున్నాయి. వృద్ధాప్యాన్ని కేవలం ఆరోగ్య సమస్యగా కాకుండా సామాజిక సంక్షేమ సమస్యగా కూడా చూడాల్సిన అవసరం ఏర్పడింది.జపాన్, ఇటలీ, జర్మనీ, దక్షిణ కొరియా వంటి అభివృద్ధి చెందిన దేశాలు ఇప్పటికే ఈ పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. జపాన్‌లో 65 ఏళ్లు పైబడిన వారు జనాభాలో దాదాపు 30 శాతం. ఫలితంగా శ్రామికుల కొరత, పెన్షన్ వ్యయం, ఆరోగ్య సేవల భారం పెరిగాయి. ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకు ఆ దేశాలు రోబోటిక్స్, కృత్రిమ మేధస్సు, గృహాధారిత వైద్య సేవలు, సీనియర్ పౌరులకు పునరుద్యోగ అవకాశాలు, కుటుంబాలకు శిశు సంరక్షణ ప్రోత్సాహకాలు వంటి విధానాలను అమలు చేస్తున్నాయి. జనాభా మార్పులను ముందుగానే అంచనా వేసి ప్రణాళికలు రూపొందించకపోతే ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయో ఈ దేశాలు స్పష్టమైన పాఠాన్ని చెబుతున్నాయి. భారత్‌కు ఇంకా సమయం ఉంది. కానీ ఆ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ప్రతి జిల్లాలో జెరియాట్రిక్ వైద్య విభాగాలు, వృద్ధులకు ప్రత్యేక ఆరోగ్య బీమా, ఇంటి వద్ద వైద్య సేవలు, సులభ ప్రజా రవాణా, వృద్ధులకు అనుకూల పట్టణాల రూపకల్పన, సామాజిక భద్రతా పథకాల విస్తరణకు ప్రాధాన్యం ఇవ్వాలి. పని చేయగలిగే సీనియర్ పౌరుల అనుభవాన్ని దేశాభివృద్ధికి వినియోగించే విధానాలు రూపొందించాలి. అదే సమయంలో కుటుంబ వ్యవస్థను బలోపేతం చేస్తూ, వృద్ధుల పట్ల గౌరవాన్ని విద్యా వ్యవస్థలో భాగం చేయాలి.వృద్ధ జనాభా పెరగడం సంక్షోభానికి సంకేతం కాదు; అది అభివృద్ధి చెందిన సమాజ లక్షణం. కానీ దానికి తగిన ప్రణాళికలు, వనరులు, విధానాలు లేకపోతే అదే అభివృద్ధికి అతిపెద్ద అడ్డంకిగా మారుతుంది. వృద్ధులను భారం కాదు, అనుభవ సంపదగా గుర్తించి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచగలిగితేనే భారత్ జనాభా మార్పును అభివృద్ధి అవకాశంగా మలచగలదు.

# పోలవరం నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం:...

### ముఖ్యమంత్రికి వినతిపత్రం సమర్పించిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

### జీలుగుమిల్లిలో నూతన పశువైద్య ఆసుపత్రి భవనం మరియు ఖాళీ పోస్టుల భర్తీకి విజ్ఞప్తి.

### కొయ్యలగూడెంలో నూతన అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని కోరిన ఎమ్మెల్యే .

### బుట్టాయిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి ప్రత్యేక నిధులు మరియు వైద్యుల పోస్టుల భర్తీ .

### నియోజకవర్గ వ్యాప్తంగా ప్రధాన రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని అభ్యర్థన.

**అమరావతి:జులై 30(ప్రజా వీక్షణం)**



ఏలూరు జిల్లా పోలవరం నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన పలు కీలక అంశాలపై అమరావతి సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని పోలవరం నియోజకవర్గం శాసనసభ్యులు చిర్రి బాలరాజు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పలు ప్రధాన డిమాండ్లను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లినట్లు ఎమ్మెల్యే తెలిపారు .జీలుగుమిల్లి ప్రభుత్వ పశువైద్య ఆసుపత్రికి నూతన భవన నిర్మాణం చేపట్టాలని, అలాగే పోలవరం నియోజకవర్గంలో ఖాళీగా ఉన్న పశువైద్యుల పోస్టులను అత్యవసరంగా భర్తీ చేయాలని ఆయన కోరారు. ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణార్థం కొయ్యలగూ డెంలో నూతన అగ్నిమాపక కేంద్రం (ఫైర్ స్టేషన్ ) ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. బుట్టాయిగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను భర్తీ చేయడంతో పాటు, ఆసుపత్రి అభివృద్ధికి అవసరమై న నిధులను తక్షణమే మంజూరు చేయాలని కోరారు. అంతేకాకుండా, పోలవరం నియోజకవర్గంలోని ప్రధాన రహదారుల నిర్మాణం మరియు అభివృ ద్ధి పనులను వేగవంతం చేసి, ఇందుకు తగిన నిధులు కేటాయిం చాలని విజ్ఞప్తి చేశారు.పోలవరం నియోజ ఓకవర్గ ప్రజల అవసరాలు, స్థానిక సమస్యలను గుర్తించి సమర్పించిన ఈ ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అత్యంత సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తెలిపారు. ఈ విజ్ఞప్తులపై తక్షణమే స్పందించి, అవసరమైన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు.

ప్రజావీక్షణం
దినపత్రిక

GENERAL NEWS
31 శుక్రవారం, జులై 2026
7
www.prajaveekshanam.in

## మక్కినవారిగూడెంలో ఘనంగా క్రిస్టియన్ జేఏసీ సర్వసభ్య సమావేశం

### సమాజ అభివృద్ధిలో క్రిస్టియన్ సంఘాల సేవలు అభినందనీయం : ...ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

**మక్కినవారిగూడెం జులై 30(ప్రజా వీక్షణం)**

పోలవరం నియోజకవర్గ స్థాయి క్రిస్టియన్ జేఏసీ సర్వసభ్య సమావేశం గురువారం మక్కినవారిగూడెంలోని షారోన్ మినిస్ట్రీస్‌లో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పోలవరం నియోజకవర్గ శాసనసభ్యులు (ఎమ్మెల్యే) చిర్రి బాలరాజు ముఖ్య అతిథిగా విచ్చేసి సభనుద్దేశించి ప్రత్యేక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ.. సమాజ సర్వతోముఖాభివృద్ధికి క్రిస్టియన్ సంఘాలు అందిస్తున్న సేవలు ఎనలేనివని, అవి ఎంతో అభినందనీయమని కొనియాడారు. ప్రతి వర్గం సంక్షేమం, సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని స్పష్టం చేశారు. నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రజల సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో క్రిస్టియన్ జేఏసీ అధ్యక్షుడు బి. ఎజ్రా శాస్త్రి, చైర్మన్ స్టీవెన్, ప్రధాన కార్యదర్శి నిరీక్షణరావు, వైస్ ప్రెసిడెంట్ జోసెఫ్, వర్కింగ్ ప్రెసిడెంట్ అనిల్ కుమార్, బాసేల్ అలాగే కూటమి నాయకులు జట్ల సత్యనారాయణ, పిన్నమనేని మధు, సి.హెచ్. నవీన్, రవి, మోహన్, సాయి తదితరులు క్రియాశీలకంగా పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేశారు.



## ఆర్.వి. చందన పర్యవేక్షణలో పారిజాత గిరిలో వైభవంగా శ్రీనివాస కల్యాణం

### గోకుల తిరుమల పారిజాతగిరి క్షేత్రంలో కనులపండువగా ఆషాడమాస శ్రవణా నక్షత్ర కల్యాణోత్సవం

**జంగారెడ్డిగూడెం జులై 30(ప్రజా వీక్షణం)**

గోకుల తిరుమల పారిజాత గిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఈవో, అసిస్టెంట్ కమిషనర్ ఆర్.వి. చందన మరియు ధర్మకర్తల మండలి చైర్మన్ అల్లూరు రామకృష్ణ పర్యవేక్షణలో ఆషాడమాస శ్రవణా నక్షత్ర పర్వదిన వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ముఖమండపంలోని ప్రత్యేక వేదికపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని ఉత్సవమూర్తులను సుందరంగా అలంకరించి ఈ దివ్య కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా జరిపించారు. ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో ఈ వేడుక శాస్త్రోక్తంగా సాగింది. ఈ పవిత్ర పూజా కార్యక్రమంలో అర్చకులు రుషికేష్, కుమార్ ఆచార్యులు, రాఘవాచార్యులు భక్తిశ్రద్ధలతో విధులను నిర్వహించారు. స్వామివారి కల్యాణంలో ఆరుగురు దంపతులు ఉభయదారులుగా పాల్గొని ప్రత్యేక పూజలు సమర్పించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుండి తరలివచ్చిన విశేష సంఖ్యలోని భక్తులు ఈ దివ్య కల్యాణాన్ని తిలకించి, స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి ధన్యులయ్యారు. ఈ వైదిక కార్యక్రమం ఎలాంటి లోటుపాట్లు లేకుండా విజయవంతంగా జరిగేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ఈవో, అసిస్టెంట్ కమిషనర్ ఆర్.వి. చందన మరియు చైర్మన్ అల్లూరు రామకృష్ణ దగ్గరుండి పర్యవేక్షించారు.



## ఓటరు నమోదు త్వరగా పూర్తి చేసుకోండి

### వీసం సురేందర్ రెడ్డి

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జులై 30**

**(ప్రజా వీక్షణం న్యూస్)**

ఆగస్టు 3తో ఓటరు నమో దు గడువు ముగియనున్న నేపథ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరూ వెంటనే తమ బీ ఎల్ఓ ను సంప్రదించి ఎన్యూమరేషన్ ఫారం సమర్పించాలని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వీసం సురేందర్ రెడ్డి కోరారు. ఓటు హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు అని, ప్రజాస్వామ్య బలోపే తానికి ప్రతి ఓటు కీలక మని ఆయన పేర్కొన్నారు.



## దోమ కాటు వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి








### - ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్

### చింతలపూడిలో ఘనంగా మలేరియా మాసోత్సవాలు

### మలేరియా సబ్ యూనిట్ ఎన్ ఏ ప్రసాద్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ.... పాల్గొన్న ఎమ్మెల్యే

**చింతలపూడి, (ఏలూరు జిల్లా):జులై 30 (ప్రజా వీక్షణం)**

ఏలూరు జిల్లాలోని స్థానిక చింతలపూడిలో మలేరియా మాసోత్సవాల సందర్భంగా చింతలపూడి మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎన్.ఏ. ప్రసాద్ నిర్వహించిన అవగాహన ర్యాలీలో ముఖ్య అతిథిగా చింతలపూడి నియోజకవర్గం ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్ పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వర్షాకాలంలో దోమలు వృద్ధి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అలాగే ముఖ్యంగా ఈ వర్షాకాలంలో వచ్చే మలేరియా, డెంగీ వంటి ప్రాణాంతక వ్యాధుల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే వ్యాధి నివారణ చర్యలపై కూడా అవగాహన కల్పించారు. అలాగే ఈ ర్యాలీలో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఏ ఎన్ ఎమ్ ఆశా కార్యకర్తలు పాల్గొని ప్లకార్డులతో ప్రజలకు నినాదాల ద్వారా అవగాహన కల్పించారు. అంతేకాకుండా పరిసరాల శుభ్రత, దోమతెరల వాడకం ద్వారానే మలేరియా, డెంగీలను పూర్తిగా తరిమికొట్టగలమని వైద్య అధికారులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు జవాబు దారిగా పని చేయాలి.. ఎమ్మెల్యే జిఎంఆర్..






**దేవరకద్ర జులై 30 ప్రజా వి క్షణం**

ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం చేయకుండా జవాబు దారి తనంతో పనిచేస్తూ ప్రభుత్వ పథకాలకు సంబంధించి సర్పంచ్ ల తో చర్చించి పరిష్కారం చేసేందుకు చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి అన్నారు. గురువారము నియోజకవర్గ పరిధిలో చిన్న చింతకుంట మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని, అన్ని ప్రభుత్వ శాఖల పనితీరును సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా రెవెన్యూ, వ్యవసాయ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఉపాధి హామీ, విద్య, వైద్య ఆరోగ్యం, విద్యుత్, హౌసింగ్, మిషన్ భగీరథ, గ్రామీణ నీటి సరఫరా, పశు సంవర్ధక, ఆర్అండ్‌బీ, ఉద్యానవన, ఎక్సైజ్, ఇరిగేషన్, ఫారెస్ట్, వెటర్నరీ తదితర అన్ని శాఖల అధికారులు తమ శాఖల పురోగతిని సమావేశంలో వివరించారు, అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించకుండా జవాబుదారీతనంతో చేస్తూ, ప్రభుత్వ పథకాల సంబంధించి సర్పంచులతో చర్చించి, సమన్వయం తో పని చేయాలి. అని ఆయన అన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు విస్తృతంగా ప్రచారం కల్పించాలి. అని ఆయన కోరారు. అన్ని శాఖల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలి. అని అని చెప్పారు. రెవెన్యూ శాఖ భూ సమస్యలు, ప్రజల దరఖాస్తులను వేగంగా పరిష్క రించాలి. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణా లు ఎంతగానో మెరుగుపరిచింది, తద్వారా ప్రభుత్వ పాఠశాలలో అడ్మిష న్స్ పెరిగాయి. ఉపాధి హామీ పథకం కు సంబంధించి, నూతన వీబీజీ రామ్ పనులపై అధికారులు సర్పంచ్ లకు అవగాహన కల్పించాలి. సర్పంచ్ లతో చర్చించి, ప్రతి గ్రామంలో అవసరమైన అభివృద్ధి పనులను ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టాలి. అని ఆయన అన్నారు. నీటి సంరక్షణ, చెరువుల పునరుద్ధరణ కు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలి, రాబోయే సీజన్ ను దృష్టిలో ఉంచుకుని, మెడిసిన్ ను అందుబాటు లో పెట్టుకోవాలి. అని ఆయన అన్నారు రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలి, త్వరలో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్స్, ఎ బీ స్విచ్లు, పోల్స్ తదితర విద్యుత్ ఉపకరణాలు వస్తున్నాయి మండలాల వారిగా కార్యక్రమం నిర్వహిస్తాం. అని ఆయన చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి. అని ఆయన అన్నారు. ప్రతి గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా నిరంతర నీటి సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలి. అని ఆయన కోరారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందుబాటులో ఉండేలా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి. అని ఆయన చెప్పారు. పశువైద్య సేవలను గ్రామస్థాయిలో మరింత సమర్థవంతంగా అందించాలి. అని ఆయన అన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు గ్రామాలు, మండల కేంద్రాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సాధించాలి. అని ఆయన కోరారు. డ్రగ్స్ నిర్మూలనపై ఎక్సైజ్ శాఖ కఠిన చర్యలు చేపట్టాలి. అని ఆయన ఆదేశించారు. రోడ్లు, భవనాల నిర్మాణ పనులను, నిర్ణీత గడువులో పూర్తి చేయించేలా అధికారులు కృషి చేయాలి. అని ఆయన అన్నారు. ఉద్యానవన పంటలను ప్రోత్సహించి, రైతులకు ఉద్యానవన పంటల గురించి అవగాహన కల్పించి, ఉద్యాన పంటల సాగును మరింతగా పెంచేలా హార్టికల్చర్ అధికారులు పనిచేయాలి. అని ఆయన కోరారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే, ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల చెందిన అధికారులు పాల్గొన్నారు.

## మహిళా పోలీస్ స్టేషన్--2ను తనిఖీ చేసిన ఏసీపీ సదయ్య





**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జులై 30 (ప్రజా వీక్షణం న్యూస్)**

వరంగల్ పోలీస్ కమిషన రేట్ పరిధిలోని రంగంపేట మహిళా పోలీస్ స్టేషన్-- 2ను క్రైమ్స్ ఏసీపీ సద య్య వార్షిక తనిఖీల్లో భాగంగా పరిశీలించారు. మహిళల ఫిర్యాదులను సున్నితంగా స్వీకరించి, కేసుల దర్యాప్తు వేగవంతం చేసి బాధితులకు త్వరిత న్యాయం అందించాలని సూచించారు. స్టేషన్ రికా ర్డుల నిర్వహణ, పరిశుభ్రత, క్రమశిక్షణతో ప్రజలకు నాణ్యమైన సేవలు అందిం చాలని అధికారులకు ఆదే శించారు.

ప్రజావీక్షణం
దినపత్రిక

# ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక రూపొందించడంలో ప్రభుత్వం వైఫల్యం..

## పంటల బీమా గడువు ఆగస్టు 30 వరకు పొడిగించాలి.

## ఉచిత పంటల బీమా అమలు చేయాలి.

## - ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్

**ఏలూరు జూలై 30:(ప్రజా వీక్షణం)**

ఎల్ నినో ప్రభావంతో ఏర్పడిన వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక రూపొందించడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాస్ తీవ్రంగా విమర్శించారు.పంటల బీమా ప్రీమియం చెల్లింపు గడువును ఆగస్టు 30 వరకు పొడిగించాలని, ఉచిత పంటల బీమా పథకం అమలు చేయాలని కోరారు. బుధవారం ఏలూరు అన్నే భవనంలో రైతాంగ సమస్యలపై ఆయన మాట్లాడారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడిచినా ఎల్‌నినో ప్రభావంతో సకాలంలో వర్షాలు లేకపోవడంతో జూన్‌లో పంటల సాగు సక్రమంగా సాగలేదన్నారు. వర్షాభావం కారణంగా పంటలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని, ప్రభుత్వం వెంటనే ప్రత్యామ్నాయ ప్రణాళిక ప్రకటిం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పంటల బీమా నమోదు గడువును ఆగస్టు 30 వరకు పొడిగించాలన్నారు.గతంలో మాదిరిగా ఉచిత పంటల బీమా అమలు చేయాలన్నారు.పంట రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు.వ్యవసాయ అధికారులు రైతులందరూ పంటలకు బీమా చేయించుకోవాలని సూచిస్తున్నప్పటికీ, నాన్–లోనీ రైతులు మీ సేవా, ఆన్‌లైన్ కేంద్రాల్లో సర్వర్ సమస్యల కారణంగా బీమా నమోదు చేసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జూలై 31తో గడువు ముగియనున్న నేపథ్యంలో రైతుల ప్రయోజనాల దృష్ట్యా గడువును ఆగస్టు 30 వరకు పొడిగించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచిత పంటల బీమాను అమలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు అందజేసి వడ్డీ లేని పంట రుణాలు అందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి వర్జీనియా పొగాకు రైతులను ఆదుకుంటామని కిలోకు రూ.20లు వ్యత్యాసపు ధర చెల్లిస్తామని చేసిన ప్రకటన హాస్యాస్పదంగా ఉన్నదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న కనీస ధరలు కంటే అదనంగానే రైతులకు ధర వస్తున్నదని, ప్రస్తుతం వస్తున్న ధరలు పెట్టుబడి ఖర్చులు కంటే అతి తక్కువగా ఉండటం వలన పొగాకు రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కిలోకు సరాసరి ధర రూ.310 అమలు చేసే చర్యలు చేపట్టాలని, ఈ ధరకు ఎంత తక్కువ వస్తే అంత ధరను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యత్యాసపు ధర అమలు చేసి ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కోన శ్రీనివాసరావు పాల్గొన్నారు.



# తుర్లపాడు ఘటనలో గాయపడిన టీడీపీ నేతల పరామర్శ

## క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి:.. ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

**నందిగామ, జులై 30 (ప్రజా వీక్షణం):**

ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం తుర్లపాడు గ్రామంలో ఇటీవల చోటుచేసుకున్న ఘర్షణలో గాయపడి, విజయవాడలోని ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న టీడీపీ నేతలను నందిగామ శాసనసభ్యులు తంగిరాల సౌమ్య పరామర్శించారు.విజయవాడలోని పుష్ప హోటల్ సెంటర్ సమీపంలోని సన్‌రైజ్ హాస్పిటల్‌తో పాటు, 5వ రూట్ నంబర్‌లోని ఆంధ్ర మెయిన్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఆమె పరిశీలించారు. నియోజకవర్గ పరిశీలకులు తాళ్ల వెంకటేష్ యాదవ్ మరియు కూటమి నేతలతో కలిసి ఆసుపత్రులకు వెళ్లిన ఎమ్మెల్యే, బాధితుల ఆరోగ్య పరిస్థితిని స్వయంగా అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దాసరి చిన్న ప్రభు, పొల్లా పుల్లారావు, దాసరి అశోక్, అప్పారావు తదితర క్షతగాత్రులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించడంలో ఎటువంటి లోటుపాట్లు ఉండకూడదని, వారికి మెరుగైన చికిత్సను అందించాలని వైద్య సిబ్బందికి ఎమ్మెల్యే ప్రత్యేకంగా సూచించారు. పార్టీ తరఫున, ప్రభుత్వం తరఫున బాధిత కుటుంబాలకు పూర్తి అండగా ఉంటామని ఆమె భరోసా కల్పించారు.ఈ పరామర్శ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు తాళ్ల వెంకటేష్ యాదవ్‌తో పాటు పలువురు కూటమి నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే చిర్రి బాలరాజు చొరవ ఫలించింది :...

## ఏలూరు డివిజన్‌లోకి పోలవరం, జీలుగుమిల్లి పశుసంవర్ధక సేవలు!

**పోలవరం జులై 30(ప్రజా వీక్షణం)**

ఏలూరు జిల్లా పోలవరం నియోజకవర్గ పరిధిలోని పాడిరైతులు, పశుపోషకులకు పరిపాలనా పరంగా ఎంతో మేలు చేకూర్చేలా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. పోలవరం మరియు జీలుగుమిల్లి మండలాల పశుసంవర్ధక సేవల పరిపాలనా పరిధిని నూజివీడు డివిజన్ నుంచి ఏలూరు పశుసంవర్ధక డివిజన్‌కు మార్చే ప్రతిపాదనకు ప్రభుత్వం ఆమోద ప్రక్రియను పూర్తి చేసింది. ఈ మేరకు విజయవాడలోని పశుసంవర్ధక శాఖ డైరెక్టరేట్ అధికారికంగా మెమో జారీ చేసింది. గత కొంతకాలంగా పరిపాలనా పరిధి నూజివీడు డివిజన్‌లో ఉండటం వల్ల దూరభారంతో పాటు సేవల్లో అలసత్వం జరుగుతోందని స్థానిక పాడిరైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యను తీవ్రంగా పరిగణించిన పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర (ట్రైకార్) ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. వీరి విజ్ఞప్తిని సమగ్రంగా పరిశీలించిన జిల్లా పశుసంవర్ధక అధికారి ప్రతిపాదనలు సిద్ధం చేయగా, పశు సంవర్ధక శాఖ డైరెక్టరేట్ ఈ అంశంపై తుది చర్యలు పూర్తి చేసింది.ఈ నిర్ణయంతో పోలవరం, జీలుగుమిల్లి ప్రాంతాల్లో పశుసంవర్ధక సేవల నిర్వహణ మరింత సులభతరం కానుంది. ప్రభుత్వ పథకాలు, వైద్య సేవలు, ఇతర పరిపాలనా పరమైన సేవలు రైతులకు వేగంగా అందే అవకాశం ఏర్పడింది. నియోజకవర్గ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తమ విజ్ఞప్తిని ఆమోదించిన రాష్ట్ర ప్రభుత్వానికి, సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పష్టం చేశారు.



# విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

## డీఎఫ్‌వో బోగ నికిత

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జులై 30 (ప్రజా వీక్షణం న్యూస్)**

వరంగల్ దేశాయిపేటలోని ఒయాసిస్ పబ్లిక్ స్కూల్ లో గురువారం నిర్వహించి న ఇన్వెస్టిచర్ సెరిమనీలో జిల్లా ఫారెస్ట్ అధికారి బోగ నికిత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భం గా విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుత భావం, నిజాయితీని అలవర్చుకో వాలని సూచించారు. అనంతరం ఎంపికైన విద్యా ర్థి నాయకులకు బ్యాడ్జీలు ప్రదానం చేయగా, కరాటే ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకు న్నాయి.




# జాతీయ రహదారుల బ్లాక్‌స్పాట్ల నిర్మూలన వేగవంతం చేయాలి

## వరంగల్ నీటి వనరుల పునరుద్ధరణకు మరింత సహకారం అందించాలి

## ఎంపీ కడియం కావ్య

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జులై 30 (ప్రజా వీక్షణం న్యూస్)**



లోక్‌సభలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య జాతీయ రహదారులపై ప్రమాదకర ప్రాంతాల (బ్లాక్ స్పాట్లు) నిర్మూలనపై కేంద్రాన్ని ప్రశ్నించారు. దేశ వ్యాప్తంగా ఏఐ ఆధారంగా 6,358 బ్లాక్ కారిడార్లను గుర్తించినట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. వరంగల్‌లోని ప్రమాదకర ప్రాంతాల భద్రతా పనుల ను వేగవంతం చేసి,శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టా లని ఎంపీ కోరారు. వరంగ ల్ నీటి వనరుల పునరుద్ధ రణకు మరింత సహకారం అందించాలన్నారు. జిల్లా లో నీటి వనరుల పునరుద్ధ రణపై లోక్‌సభలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య ప్రశ్నించారు. రాయపర్తిలో రూ.10.16 కోట్ల వాటర్‌షెడ్ ప్రాజెక్టు అమలవుతుండ గా, రూ.3.17 కోట్లు విడుద లైనట్లు కేంద్రం తెలిపింది. ఎంఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద గత మూడేళ్లలో రూ.85. 65 కోట్లతో 5,369 నీటి సంరక్షణ పనులు పూర్త య్యాయని వెల్లడించింది. మిగిలిన నిధులను త్వర గా విడుదల చేసి, నీటి వన రుల అభివృద్ధిని జిల్లా వ్యాప్తంగా విస్తరించాలని ఎంపీ కోరారు.

# పొగాకు రైతులకు భారీ ఊరట .. మూడేళ్లపాటు వడ్డీ లేని రుణం!

## ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ చొరవ... బ్యారెల్‌కు రూ. 50,000 వడ్డీ లేని రుణం మంజూరు

**ఢిల్లీ/ఏలూరు, జూలై 30 (ప్రజా వీక్షణం):**

పొగాకు రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం అంకితభావంతో పనిచేస్తోందని ఏలూరు పార్లమెంటు సభ్యులు పుట్టా మహేష్ కుమార్ స్పష్టం చేశారు. ప్రస్తుతం ఢిల్లీలో జరుగుతున్న పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో పాల్గొంటున్న ఆయన.. గురువారం జరిగిన పొగాకు బోర్డు సమావేశానికి వర్చువల్ విధానంలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రస్తుత సీజన్‌లో కొనుగోలు కేంద్రాల్లో పొగాకు ధరలు పడిపోవడం, రైతులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను బోర్డు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.రైతులను ఆదుకోవాల్సిన అవసరంపై సీఎం చంద్రబాబు నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుతో కలిసి తాను స్వయంగా కేంద్ర వాణిజ్య మంత్రిని, పొగాకు బోర్డు ఛైర్మన్ సభ్యులను పలుమార్లు కలిసి చర్చించినట్లు ఎంపీ తెలిపారు. ఈ ఉమ్మడి కృషితోనే నేడు జరిగిన బోర్డు సమావేశంలో బ్యారెల్‌కు రూ. 50,000 చొప్పున వడ్డీ లేని రుణం అందించేందుకు అంగీకారం కుదిరిందని ఆయన వెల్లడించారు. ఈ నిర్ణయం ద్వారా "లో గ్రేడ్" (తక్కువ రకం) పొగాకు పండించిన రైతులకు మూడేళ్ల పాటు గ్రేటర్ వెసులుబాటు లభిస్తుందని పేర్కొన్నారు.అంతర్జాతీయ మార్కెట్లో చోటుచేసుకున్న పరిణామాల వల్లే ఈ ఏడాది పొగాకు ధరలు గణనీయంగా తగ్గాయని ఎంపీ తెలిపారు. బోర్డు అనుమతించిన దానికంటే కొంత అధికంగా రైతులు పంట సాగు చేయడం కూడా సమస్యకు ఒక కారణమని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా లో గ్రేడ్ పొగాకు కొనుగోలుకు ట్రేడింగ్ కంపెనీలు ముందుకు రాకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందన్నారు.అయినప్పటికీ, అన్నదాతలకు ఎట్టి పరిస్థితుల్లోనూ గిట్టుబాటు ధర దక్కేలా తీవ్రంగా కృషి చేస్తున్నామని ఎంపీ భరోసా ఇచ్చారు. గత రెండేళ్లలో తాము చేసిన ప్రత్యేక ప్రయత్నాల వల్ల పొగాకు ధర గరిష్టంగా కేజీకి రూ. 470 వరకు పలికిందని గుర్తుచేశారు. ఈ ఏడాది కూడా ధర కనీసం రూ. 300 పైనే ఉండేలా అన్నిరకాల ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నామని ఆయన స్పష్టం చేశారు.



# జిల్లా యంత్రాంగం అప్రమత్తం..

## ప్రజలు ఆందోళన చెందొద్దు...జిల్లా కలెక్టర్ హరిత.

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జూలై 30 (ప్రజా వీక్షణం న్యూస్)**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా పనిచేస్తోందని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ కె. హరిత తెలిపారు.అడ ప్రాజెక్టును పరిశీలించిన కలెక్టర్ ప్రాజెక్టులోకి వస్తున్న, విడుదల చేస్తున్న వరద నీటిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు.ప్రాజెక్టు దిగువ ప్రాంతాల్లో నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు వాగులు, కాజ్‌వేలు, లోతట్టు ప్రాంతాల వద్దకు వెళ్లవద్దని సూచించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసించే వారిని అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు సహాయం అందించేందుకు జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, అవసరమైతే 8500844365కు సంప్రదించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.



# ఇల్లు గోడ కూలిపోవడంతో రోడ్డు పైన ఆదివాసి కుటుంబం..

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జూలై 30 (ప్రజా వీక్షణం న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలంలోని చిన్న రాస్పల్లి గ్రామంలో భారీ వర్షాల కారణంగా ఆత్రం అంజన్న ఆదివాసి పర్ధాన్ తెగకు చెందిన నివాసం ఉంటున్న ఇల్లు గోడ కూలిపోవడం జరిగింది.గోడ కూలిపోయిన విషయం తెలుసుకున్న వెనువెంటనే డివైఎఫ్ఐ దహెగాం మండల కన్వీనర్ దత్తాత్రేయ ఆ స్థలాన్ని సందర్శించరూ.ఈ సందర్భంగా మాట్లాడుతూ గత పది పదిహేను సంవత్సరాలుగా నివాసం ఉంటున్న ఇంటి గోడ కూలిపోవడంతో వారికి ఇప్పటివరకు ఇందిరమ్మ ఇల్లు ప్రభుత్వం మంజూరు చేయకపోగా ఇప్పుడున్నటువంటి ఇంటి గోడ కూలిపోవడం జరిగిందనరూ. వెంటనే ఎమ్మార్వో గారు ఆ ఇంటిని సందర్శించి వారికి నష్టపరిహారంగా 50 వేల రూపాయలతో పాటు ఒక ఇందిరమ్మ ఇల్లును మంజూరు చేయాలని డివైఎఫ్ఐ గా డిమాండ్ చేస్తున్నాం.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.



Printed & published owned by K.SRAVAN KUMAR. Printed Published RK PRINTING PRESS at 6-1-948 Boyawada Street Nalgonda.Pin : 508001. Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. RNI.NO.APTEL/2009/29433.(CELL ) 9866330400 prajaveekshanam@gmail.com

# ప్రజావీక్షణం
దినపత్రిక

GENERAL NEWS

31 శుక్రవారం, జులై 2026



# భరతమాత ముద్దుబిడ్డ,స్వాతంత్ర సమరయోధులు సర్దార్ ఉద్దం సింగ్

## - నేడు ఆయన బలిదాన దినోత్సవం

1919 ఏప్రిల్ 13 పంజాబ్ లోని అమృతసర్ లో జలియన్ వాలాబాగ్ అనే చిన్నతోటలో రౌలత్ చట్టానికి వ్యతిరేఖంగా శాంతియుతంగా సభ జరుపుకుంటున్న అమాయకప్రజలపై జనరల్ డయ్యర్ ఆధర్యంలో విచక్షణారహితంగా కాల్పులు జరపడంతో దాదాపు వెయ్యిమంది మరణించారు. రెండువేలమంది క్షతగ్రాత్రులైనారు. ఇది అత్యంత ఘోరమైన సంఘటన గా చరిత్రలో మిగిలిపోయింది..ఆ రోజు ఆ సభలో మంచినీరు సరఫరా చేయడానికి ఒక అనాధశరణాలయం నుండి 19 యేండ్ల కుర్రాడు వచ్చాడు.. జరిగిన దురంతం చూసి చలించిపోయాడు. నేలమీదపరుండి ప్రాణాలు కాపాడుకున్న ఆ కుర్రాడు..శవాల గుట్టలను చూసి కోపంతో వణికిపోయాడు.. కంటినిండానీరు ఉబికివస్తుండగా ఆ తోటలోని రక్తం అంటినమట్టిని తీసుకొని "ఈ దురంతానికి కారకుడైన వ్యక్తులను చంపేదాకా నేను చావను"అంటూ ప్రతిజ్ఞ చేశాడు..దీనికి కారకులైన డయ్యర్స్ ను వెతుకుంటూ బయలుదేరాడు. తుపాకీ కాల్చుడం నేర్చుకున్నాడు. కొన్నిరోజులు భగత్ సింగ్ తో కలిసి విప్లవకార్యక్రమాలలో పాల్గొన్నాడు..డయ్యర్స్ లో ఒకరైన ఫ్రాన్సిస్ డయ్యర్ 1927లో భారత్ లోనే చనిపోయాడు. దానితో జనరల్ ఓ డయ్యర్ ను చంపేందుకు ఇంగ్లండ్ పయనమవ్వాలనుకుంటున్న సమయంలో భగత్ సింగ్ తో పాటు ఆయనను అరెస్ట్ చేశారు.తన కళ్ళముందే భగత్ సింగ్ ను ఉరితీయడం చూసి హతాసుడైనాడు..1932లో విడుదలైన తర్వాత ఇంజనీరింగ్ చదవాలని ఇంగ్లండ్ పయనమైనాడు. పేరు మార్చుకుంటూ జనరల్ ఓ డయ్యర్ ను వెంటాడసాగాడు.. దీనికోసం చాలా కష్టాలు పడ్డాడు. ఆకలితో నిద్రలేని ఎన్నో రాత్రులు గడిపాడు.ఒకరోజు ఓ డయ్యర్ ఒక కాన్ఫరెన్స్ కు హాజరుకాబోతున్నట్లు సమాచారం అందిందతనికి. ఎంతో కష్టపడి ఎంట్రీ పాస్ సంపాదించాడు...ఒకపుస్తకంలో ఫిస్టల్ పట్టేటట్లు కాగితాలను కత్తించి అందులో దానిని దాచాడు..ఏమీ ఎరగనట్లు ఓ డయ్యర్ సభకు వెళ్ళాడు...సభలో ఓ డయ్యర్ ను వీరుడు,ధీరుడంటూ పొగిడేస్తున్నారు...అది వింటున్న ఆ యువకుడి రక్తం సలసలలాడసాగింది. జలియన్ వాలా బాగ్ లో అమాయకుల ఆర్తనాదాలు గుర్తుచ్చాయి..రక్తమడుగులో గిలగిలకొట్టుకుంటూ ప్రాణాలిడుస్తున్న అభాగ్యులు గుర్తుకొచ్చారు..ఇంతలో డయ్యర్ ప్రసంగం ముగిసింది...ఆయనను అభినందించాడానికి జనాలు ఆయన దగ్గరకు వెళుతున్నారు. ఆ యువకుడి కూడా గంభీరంగా లేచి పుస్తకం చేతబట్టుకొని డయ్యర్ దగ్గరకు వెళుతున్నాడు...నిశితంగా గమనిస్తున్న ఓ డయ్యర్ ఆ యువకుడి వేషధారణను చూసి ఏదో గుర్తుకొస్తున్నట్లు అనిపించి అప్రమత్తమయ్యే లోపలే పుస్తకంలోని పిష్టల్ మెరుపువేగంతో తీయడం,అంతే



వేగంతో ఓ డయ్యర్ పై గుళ్ళ వర్షం కురిపించడం జరిగిపోయింది..జనరల్ ఓ డయ్యర్ నేలకొరిగాడు..ఎవరినైతే నా బానిసలు..వారి ప్రాణాలు నేను పెట్టిన బిక్ష అంటూ జలియన్ వాలాబాగ్ కాల్పుల తర్వాత గర్వంగా అన్నాడో...ఆ సంఘటనలోని వ్యక్తి చేతిలోనే ప్రాణాలు విడిచాడు.ఇది 1940 జూలై 13న జరిగింది.ఓ.డయ్యర్ ను చంపిన తరువాత ఈయనను చంపడానికే నేను ఇన్నిరోజులు బతికాను.ఇంక నన్ను ఏమైనా చేసుకోండి అంటూ లొంగిపోయాడాయువకుడు... ఇంతకీ ఆ యువకుడి పేరేమిటో తెలుసా???? షంషేర్ ఉద్దామ్ సింగ్ ....ఆ విప్లవవీరుడి వర్ధంతి సందర్భంగా.. అమర వీరునికి నమః సుమాంజలి!!!ఉద్దమ్ సింగ్ పంజాబ్ లోని సంగ్రూర్ జిల్లా లోని సునం తెహసీల్ కు చెందిన కలన్ గ్రామంలో డిసెంబర్ 26 ,1899 న జన్మించాడు.1940 జూలై 31 (వయసు 40) కారాగారము, యునైటెడ్ కింగ్డమ్ లో ఉరితీయబడ్డారు.కోర్టులో ఉదంసింగ్ ప్రసంగం నేనే చేశాను ఈ హత్య ఎందుకు అంటే అతని మీద నాకు పగ నేను అతనిని చంపే అంత తప్పు చేసాడు నా దేశ ప్రజల ఆత్మ ను భంగపరచాడు అందుకనే వాడిని చంపి వేసాను అందుకోసం 21 సం!! లు వేచి చూసాను నేను ఈ పని చేసినందుకు సంతోషంగా ఉన్నాను నేను మరణంకు భయపడలేదు. నేను నా దేశం కోసం మరణిస్తున్నాను.

# బస్వాపూర్ గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ..

**దేవరకద్ర జులై 30 ప్రజా విక్షణం**

దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి. సహకారంతో, బస్వాపూర్ గ్రామానికి చెందిన జి. దేవమ్మ, హరిజన్ రాము, లకు చెందిన సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను గ్రామ సర్పంచ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పేద ప్రజలకు ఆపద సమయంలో ఆర్థిక భరోసా కల్పిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,కి మరియు దేవరకద్ర ఎమ్మెల్యే,కి కృతజ్ఞతలు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు.



# రక్తదానం ప్రాణదానంతో సమానం

## ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

**తాడేపల్లిగూడెం ప్రతినిధి జులై 30 (ప్రజా వీక్షణం)**

రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. ముళ్లపూడి హరిశ్చంద్ర ప్రసాద్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (తణుకు బ్రాంచ్) ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాసవీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులతో పాటు పెద్ద సంఖ్యలో యువత, స్వచ్ఛంద రక్తదాతలు పాల్గొని రక్తదానం చేయడం అభినందనీయమని కొనియాడారు. కొంతమంది మూడు నుంచి ఐదోసారి కూడా రక్తదానం చేయదానికి ముందుకురావటం సమాజానికి ఆదర్శమని ప్రశంసించారు. గతంలో తాడేపల్లిగూడెంలో బ్లడ్ బ్యాంక్ లేక రక్తం కోసం తణుకు, ఏలూరు, విజయవాడలకు వెళ్లాల్సి వచ్చేదని, ప్రస్తుతం స్థానికంగా అన్ని గ్రూపుల రక్తం అందుబాటులో ఉందని తెలిపారు. ఈ శిబిరంలో 82 యూనిట్ల రక్తం సేకరించారని, రక్తదాన కార్యక్రమాల నిర్వహణలో కృషి చేసిన రెడ్ క్రాస్ ప్రతినిధులు, అధికారులు, వైద్య సిబ్బంది, స్వచ్ఛంద కార్యకర్తలు, యువతను ఎమ్మెల్యే అభినందించారు. ప్రతి ఆరోగ్యవంతుడు స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాతగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సునీల్ కుమార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి వి.చంద్రశేఖరం, కూటమి నాయకులు పాల్గొన్నారు.



# జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు నల్మాసు ప్రభాకర్ ను సన్మానించిన నాయకులు

**మంథనిప్రతినిధి, ప్రజా విక్షణం , జూలై 30:**

పెద్దపెల్లి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు నల్మాసు ప్రభాకర్ గత 25 సంవత్సరాల నుండి వైశ్య సంఘం ద్వారా ఇతర వేదికల ద్వారా వైశ్యులకు ఇతర సామాజిక వర్గాల వారికి చేస్తున్న సేవలకు గుర్తింపుగా హైదరాబాద్ కు చెందిన లలిత కళా సమాఖ్య (సామాజిక సాంస్కృతిక సేవా సంస్థ) వారిచే అత్యున్నతమైన వైశ్య వైభవ రత్న అవార్డుతో పాటు సువర్ణ కంకణం బంగారు పథకంతో సత్కరించడానికి ఎంపికైన సందర్భంగా గురువారం మంథని పట్టణంలో రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పన్నూరు మాజీ ఎంపీటీసీ ముత్యాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మాజీ జెడ్పిటిసి గంద్ర వెంకటరమణ రెడ్డి, మాజీ ఎంపీపీ తోట చంద్రయ్య, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బుద్ధర్తి బుచ్చన్న, రావిగంటి సతీష్ లు నల్మాసు ప్రభాకర్ ను కలిసి శుభాకాంక్షలు తెలియజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. మంథని పట్టణానికి చెందిన జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు నల్మాసు ప్రభాకర్ సువర్ణ కంకణం, బంగారు పథకంతో సత్కరించడానికి ఎంపికైన సందర్భంగా మంథని పట్టణానికి చెందిన పలువురు ఆర్యవైశ్య సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు.



# మంథనిలో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ ప్రవేశాల పోస్టర్ విడుదల

**మంథని ప్రతినిధి, ప్రజా విక్షణం , జూలై 30:**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2026-27 విద్యా సంవత్సరానికి బీ.ఏ., బీ.కాం., బీ.ఎస్సీ., వంటి డిగ్రీ కోర్సులలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మంథనిలో గల అభ్యాసకుల సహాయ కేంద్రం సమన్వయకర్త కర్నాటి కృష్ణ తెలియజేశారు. ఈ మేరకు గురువారం అడ్మిషన్ల ప్రవేశాల పోస్టర్ విడుదల కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీలో చేరబోయే విద్యార్థులు ఇంటర్మీడియెట్ లేదా ఓపెన్ ఇంటర్, రెండు సంవత్సరాల ఐటిఐ, పాలిటెక్నిక్ లేదా 10౦2 విద్యార్హత కలిగిన వారందరూ అడ్మిషన్లు పొందవచ్చునని, అడ్మిషన్ల తుది గడువు ఆగస్టు 7 వరకు కలదని యూనివర్సిటీ వెబ్సైట్ ద్వారా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చునని లేదా పదవ తరగతి, ఇంటర్ సర్టిఫికెట్, క్యాస్ట్ సర్టిఫికెట్, ఆధార్ కార్డ్, పాస్పోర్ట్ సైజ్ ఫోటోతో కళాశాలలోని అభ్యాసకుల కేంద్రంలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలియజేశారు. అలాగే రెండో సంవత్సరం, మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు తమ యొక్క ట్యూషన్ ఫీజులను చెల్లించాలని తెలియజేశారు. మరిన్ని వివరాలకు 7382929649లో సంప్రదించేయాలన్నారు.




# గోదావరి పరివాహకంలో అప్రమత్తంగా ఉండండి

## ముంపు ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించాలి

## వర్షాల నేపథ్యంలో అధికారులను అప్రమత్తం చేసిన కలెక్టర్

**జగిత్యాల,జూలై30( ప్రజా విక్షణం ):**

జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆదేశించారు. ముఖ్యంగా గోదావరి పరీవాహక మండలాల్లో అధికారులు ప్రత్యేక అప్రమత్తతతో వ్యవహరించాలని, గోదావరి నీటిమట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ముంపునకు గురయ్యే గ్రామాలు, కాలనీలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అవసరమైతే ప్రజలను ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తెలిపారు.గురువారం తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులతో జూమ్ సమావేశం నిర్వహించి వర్షాల పరిస్థితిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భారీ వర్షాల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ వేగంగా సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు తమ పరిధిలోని పునరావాస కేంద్రాలను తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, ఆహారం, వైద్య సదుపాయాలతో సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ప్రజలను తరలించాల్సిన పరిస్థితి ఏర్పడితే వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు.మున్సిపల్ కమిషనర్లు పట్టణ ప్రాంతాల్లో డ్రైనేజీలు, నాలాలు ఎక్కడా మూసుకుపోకుండా వెంటనే శుభ్రపరచాలని, వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. రహదారులపై చెట్లు విరిగి పడితే వెంటనే తొలగించి రాకపోకలకు



అంతరాయం కలగకుండా చూడాలని, లోతట్టు ప్రాంతాల్లో నీటిముంపు సమస్యలు తలెత్తకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్లు, దెబ్బతిన్న విద్యుత్ లైన్లను పరిశీలించి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. పాత భవనాలు, శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు తాగునీటి బృందాలు, ఎమ్జ్గ౦÷న్సీ రెస్పాన్స్ బృందాలు, యంత్ర సామగ్రిని సిద్ధంగా ఉంచాలని, అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో 24 గంటలు పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. అధికారులు, సిబ్బంది తమ ప్రధాన కార్యాలయాల్లోనే అందుబాటులో ఉండాలని, ముందస్తు అనుమతి లేకుండా ప్రధాన కార్యాలయాలను విడిచి వెళ్లరాదని స్పష్టం చేశారు. వర్షాల కారణంగా ప్రమాదాలు, నీటి ముంపు, ఆస్తి నష్టం లేదా ప్రజల నుంచి ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని, తీసుకున్న చర్యలను జిల్లా కంట్రోల్ రూమ్కు వెంటనే తెలియజేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, అదనపు కలెక్టర్లు బి. రాజ గౌడ్,బి.ఎస్. లత, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల డిమాండ్లను నెరవేర్చాలి.

## టీ యు ఎఫ్ అధ్యక్షులు అక్రమొద్దీన్.

**జయశంకర్ భూపాలపల్లి. ప్రజా విక్షణం , జూలై 30:**

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలలో ప్రకటించిన మేనిఫెస్టో ప్రకారంగా కాలయాపన జరగకుండా డిమాండ్లను నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ అధ్యక్షులు అక్రమొద్దీన్ కోరారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అయన మాట్లాడుతూ...గత ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను నిర్లక్ష్యం చేసిన విషయాన్ని ఎత్తిచూపుతున్న ప్రస్తుత ప్రభుత్వం ఉద్యమకారులను ఆదుకోవడంలో ముందుండాలని అన్నారు.టి యు ఎఫ్ రాష్ట్ర అధికారాల ప్రతినిధి ఎండి అయుబోదిన్, ఉమ్మడి వరంగల్ జిల్లా అధికార ప్రతినిధి ఆన్మారి ప్రభాకర్ లతో కలిసి మండలాధ్యక్షులు వీ ఇ అక్రమొద్దీన్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల అంశాన్ని ప్రభుత్వ ప్రాధాన్య అంశంగా మార్చిన తెలంగాణ ఉద్యమకారుల పోరాట ఫలితంగా కే. కే.కమిటీ ఏర్పాటు . జార్ఖండ్, చత్తీస్గడ్ వంటి రాష్ట్రాల ఉద్యమకారులకు అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలు తెలంగాణ ఉద్యమకారులకు కూడా అమలు చేయాలని అన్నారు.. ఇప్పటికే ప్రభుత్వము వేసిన కే. కే. కమిటీ వివిధ ఉద్యమ సంఘాలతో సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలు, సూచనలు సేకరించడం జరిగినది. ఇకపై ఈ కమిటీ ఆలస్యం చేయకుండా రాష్ట్ర క్యాబినెట్ మరియు అసెంబ్లీలో చర్చించి మేనిఫెస్టోలో పెట్టిన అన్ని హామీలు నెరవేర్చాలని కోరుకుంటున్నాము. ఈ కార్యక్రమములో తెలంగాణ ఉద్యమకారుల మండల ప్రధాన కార్యదర్శి కలికోట దేవేందర్, సీనియర్ ఉద్యమకారులు ఠాకూర్ రమేష్ సింగ్, కారంగుల బాపురావు, పోత రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావీక్షణం
దినపత్రిక

# దంచికొడుతున్న వానలు.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు.. వాగులు, వంకలు దాటొద్దు**

**ప్రాణ రక్షణే ప్రధానం -- తాండూర్ ఎస్ఐ ప్రసాద్ రావు హెచ్చరిక**

తాండూర్; ప్రజా విక్షణం

తాండూర్ మండలంలో ఎడతెరిపి లేకుం డా కురుస్తున్న భారీ వర్షాలు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నా యి. వాతావ రణ శాఖ మరో రెండు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలం తా అత్యంత అప్రమత్తం గా ఉండాలని తాండూర్ ఎస్ఐ ప్రసాద్ రావు విజ్ఞప్తి చేశారు.ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా మండలంలో ని వాగు లు, వంకలు, ఒర్రెలు ప్రమాదక రంగా ప్రవహించే అవకాశం ఉందని, అత్యవసరం అయితే తప్ప ఎవరూ బయట కు రావద్దని సూచించారు. వరద నీరు ప్రవహిస్తున్న ప్రాంతాలను దాటే ప్రయత్నం చేయవద్దని, నీటి ప్రవాహం పూర్తిగా తగ్గిన తర్వాతే రాకపోకలు సాగించాలని హెచ్చరించారు.గ్రామాల్లో శిథిలావస్థలో ఉన్న పాత ఇళ్లు, గుడిశల్లో నివసిస్తున్న కుటుంబాలు వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. చెరువులు, వాగుల సమీపంలో నివసించే ప్రజలు తమ పిల్లలను నీటి ప్రాంతాలకు వెళ్లనీయకుండా జాగ్రత్త పడాలని, చేపల వేటకు ఎట్టి పరిస్థితుల్లోనూ వెళ్లరాదని తెలిపారు.భారీ వర్షాల సమయంలో తడి చేతులతో విద్యుత్ పరికరాలు, వైర్లు ముట్టుకోవద్దని, విద్యుత్ తీగలు తెగిపడి కనిపిస్తే వాటికి దూరంగా ఉండి వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు ఉరుములు, మెరుపులు, పిడుగుల సమయంలో పెద్ద చెట్ల కింద నిలబడరాదని, బహిరంగ ప్రదేశాల్లో ఉండకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు.ఏదైనా ప్రమాదం లేదా అత్యవసర పరిస్థితి ఏర్పడితే వెంటనే డయల్--100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని, పోలీసులు తక్షణమే సహాయక చర్యలు చేపడతారని ఎస్ఐ ప్రసాద్ రావు తెలిపారు.




# వర్షాలకు కూలిన ఇంటి గోడ...

కమాన్ పూర్ ప్రజా విక్షణం జూలై 30.

కమాన్‌పూర్ మండల పరిధిలోని పేరపల్లి గ్రామానికి చెందిన నేరెళ్ల సంధ్యారాణి ఇంటి గోడ గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కూలిపోయింది. విషయం తెలుసుకున్న సర్పంచ్ బొంగోని సదయ్య, జిపిఓ అశోక్, పంచాయతీ సిబ్బందితో కలిసి కూలిపోయిన ఇల్లును పరిశీలించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరంగా తగిన సహాయం అందేలా చూస్తామని సర్పంచ్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ బొంగోని సదయ్య మాట్లాడుతూ.. వర్షాల దృష్ట్యా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, శిథిలావస్థకు చేరిన పాత గోడలు, ఇళ్ల వద్ద ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



# నగరంలోని వర్ష ప్రభావిత ప్రాంతాలను...

**పరిశీలించిన మేయర్, డిప్యూటీ మేయర్**

కరీంనగర్ జూలై 30( ప్రజా విక్షణం )

నగరంలో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో గురువారం మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ నగరంలోని పలు వర్ష ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని పరిశీలించారు. ఇందులో భాగంగా కలెక్టరేట్ రోడ్డులో గల ప్రధాన మురుగు నీటి వరద కాలువను తనిఖీ చేసి పరిశీలించి... కలెక్టరేట్ రోడ్డుపై వర్షపు నీరు నిలవకుండా డ్రైనేజీ లోకి ప్రవహించేలా చర్యలు చేపట్టారు. స్థానికంగా ఉండి అధికార సిబ్బంది తో ఫుట్ పాత్ వీప్ హోల్స్ ను తెరిపించారు. నగరపాలక సంస్థ అధికార, సిబ్బందికి పలు సూచనలు చేస్తూ...ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఈలు లచ్చిరెడ్డి, డిజాస్టర్ సిబ్బంది పాల్గొన్నారు.




# ఆర్వోబీ పనుల జాప్యంపై బండి సంజయ్ అసహనం ప్రత్యామ్నాయ పనులకు ఆదేశం





కరీంనగర్ జూలై 30( ప్రజా విక్షణం )

కరీంనగర్‌లోని తీగలగుట్టపల్లి ఆర్వోబీ నిర్మాణ పనుల జాప్యంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఎందుకు చేయలేదని ఆర్‌అండ్‌బి అధికా రులు, కాంట్రాక్టర్లను ప్రశ్నించా రు. భూసేకరణలో జాప్యం కారణంగా పను లు ఆలస్యమయ్యాయని అధికారులు వివ రించగా, బీటీ రోడ్డు, కల్వర్టు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదని తెలిపారు. దీంతో మేయర్ కొలగాని శ్రీనివాస్, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ వెంటనే ఆర్వోబీ ప్రాంతాన్ని పరిశీలించి, మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలోనే యుద్ధ ప్రాతిపదికన బీటీ రోడ్డు, కల్వర్టు నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కాగా, భూసేకరణ పూర్తయిన వెంటనే ఆర్వోబీ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేస్తామని కాంట్రాక్టర్ వెల్లడించారు.

# కూరగాయల సాగుతో రైతులకు అధిక లాభాలు.







**బసవరాజుపల్లిలో అంతర పంటల సాగును పరిశీలించిన జిల్లా కలెక్టర్.**

జయశంకర్ భూపాలపల్లి

. ప్రజా విక్షణం , జూలై 30:

సాంప్రదాయ పంటలతో పోలిస్తే కూరగాయలు మరియు అంతర పంటల సాగు రైతులకు ఎంతో లాభదాయకమని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పేర్కొన్నారు. బసవరాజుపల్లి గ్రామంలోజిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పర్యటించి ఎల్ నినో ప్రభావంతో రైతులు వరికి బదులుగా నీరు తక్కువ వినియోగంతో పండే పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యాదగిరి, మార్త రమేష్, బోర రాజయ్య క్షేత్రాల్లో చేపట్టిన కూరగాయలు, అంతర పంటల సాగును ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ శర్మ కూరగాయలు దిగుబడి, యాజమాన్య పద్ధతులు, మార్కెటింగ్ అవకాశాల గురించి రైతులతో నేరుగా మాట్లాడి వివ రాలు అడిగి తెలుసుకున్నారు. తక్కువ పెట్టుబడితో, తక్కువ సమయంలో మంచి ఆదాయం పొందేందుకు అంతర పంటల సాగు లాభదాయకమని తెలిపా రు. కూరగాయలు సాగు వల్ల కూలీల సమస్య తగ్గుతుందని, మల్చింగ్ వల్ల అధిక దిగుబడులు వస్తాయని రైతులు తెలిపారు. నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటూ కూరగా యల సాగు వైపు రైతులు మొగ్గు చూపాలని ఒకే పంటపై ఆధారపడకు ండా అంతర పంటలు వేయడం వల్ల చీడపీడల ఉధృతి తగ్గి, ఆదాయం. లభిస్తుందని తెలిపారు. జిల్లాలోని ఇతర రైతులు కూడా వీరిని ఆదర్శంగా తీసుకుని ఆధునిక సాగు పద్ధతులను చేపట్టాలని సూచించారు.వ్యవసాయం, ఉద్యానవన శాఖల అధికారులు రైతుల కు కూరగాయలు, పప్పు దినుసు లు సాగు చేపట్టేలా అవసరమైన సాంకే తిక సలహాలు, ప్రభుత్వ పథకాల ద్వారా అందే ప్రోత్సాహకాలపై విస్తృతం గా అవగాహన కల్పించాలని సూచిం చారు. అనంతరం రైతుల వద్ద నుండి కూరగాయలు కోనుగోలు చేసి డబ్బులు చెల్లించారు. కూరగాయలు సాగు చాలా బావుందని, ఇతర రైతులకు లాభాలు, సాగు విధానం వివరించేం దుకు సోమవారం ఐడిఓసి కార్యాలయం వద్ద స్టాల్ ఏర్పాటు చేపించాలని ఉద్యాన అధికారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికా రి తిరుపతి, తహసీల్దార్ లక్ష్మి రాజయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మహాదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌ను తనఖీ జిల్లా ఎస్పీ







**పెండింగ్ కేసుల పురోగతిపై సమీక్ష -- ఆన్‌లైన్ నమోదుపై ప్రత్యేక దృష్టి**

**ప్రజలకు నిస్పాక్షికంగా సేవలు అందించాలి.**

**జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్.**

జయశంకర్ భూపాలపల్లి.

ప్రజా విక్షణం , జూలై 30:

జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, వార్షిక తనిఖీల్లో భాగంగా మహాదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి సమగ్ర తనిఖీ నిర్వహించారు. జిల్లాలో పోలీస్ వ్యవస్థ పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలు, కేసుల దర్యాప్తు పురోగతి, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ పోలీస్ స్టేషన్ ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలను నాటారు., అనంతరం పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. రోడ్డు ప్రమాద కేసులకు సంబంధించిన వాహనాల స్థితిగతులు, వాటి పరిష్కార పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రిసెప్షన్ విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, అందిన ప్రతి ఫిర్యాదును వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల పురోగతిని సమీక్షించిన ఎస్పీ గారు, దర్యాప్తు వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తూ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు .అదేవిధంగా స్టేషన్ రికార్డుల నిర్వహణ, సిబ్బంది విధి నిర్వహణ, కేసు రికార్డుల నవీకరణ విధానాన్ని పరిశీలించి, అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ నిర్వహించాలని ఆదేశించారు. రౌడీ షీటర్లపై తీసుకుంటున్న చర్యలను సమీక్షించి, వారిపై నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి పౌరుడికి స్నేహపూర్వక వాతావరణం కల్పిస్తూ, వారి సమస్యలను వేగవంతంగా, పారదర్శకంగా పరిష్కరించే విధంగా సేవలు అందించాలని అధికారులు, సిబ్బ ందికి ఎస్పీ గారు ఆదేశించారు. ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం మరింత పెంపొందించడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.ఈ వార్షిక తనిఖీలలో కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, మహాదేవ్‌పూర్ సీఐ వెంకటేశ్వర్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

ప్రజావీక్షణం దినపత్రిక

SPORTS/ BUSINESS

31 శుక్రవారం, జూలై 2026

11

www.prajaveekshanam.in

# ఇంగ్లండ్ టెస్ట్ టీమ్ హెడ్ కోచ్ గా స్టీఫెన్ ఫ్లెమింగ్



చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్కే) హెడ్ కోచ్ పదవి బాధ్యతల నుంచి తప్పుకున్న స్టీఫెన్ ఫ్లెమింగ్‌కు జాక్‌పాట్ తగిలింది. తంతే బూరెల బుట్టలో పడ్డట్టు.. ఏకంగా ఇంగ్లండ్ టెస్ట్ టీమ్ హెడ్ కోచ్ పదవి వరించింది. 18 ఏళ్ల తర్వాత ఫ్లెమింగ్‌పై సీఎస్కే వేటు వేగయా.. ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు.. హెడ్ కోచ్‌గా స్వాగతం పలికింది. ఇంగ్లండ్ టెస్ట్ టీమ్ సారథిగా తిరిగి జోరూట్‌ను ఎంపిక చేసింది.బెన్ స్టోక్స్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికడంతో అనుభవం కలిగిన జోరూట్‌కే ఇంగ్లండ్ వేల్స్ క్రికెట్ బోర్డు(ఈసీబీ) మళ్లీ సారథ్య బాధ్యతలు కట్టబెట్టింది. బ్రెండన్ మెక్‌కల్లమ్ స్థానంలో స్టీఫెన్ ఫ్లెమింగ్‌ను టెస్ట్ టీమ్ కోచ్‌గా నియమించింది. ఈ మేరకు ఈసీబీ గురువారం ఒక ప్రకటనను విడుదల చేసింది. స్టీఫెన్ ఫ్లెమింగ్ నియామకాన్ని ఈసీబీ బోర్డు ప్యానెల్ ఏకగ్రీవంగా ఆమోదించిందని పేర్కొంది. క్రికెట్ ప్రపంచంలోనే అత్యంత గౌరవనీయమైన కోచ్‌ల్లో ఒకరైన ఫ్లెమింగ్ రాకతో టెస్ట్ క్రికెట్‌లో ఇంగ్లండ్‌కు ఒక కొత్త శకం మొదలవుతుందని ఆశాభావం వ్యక్తం చేసింది. ఇంగ్లండ్ టెస్ట్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టడం చాలా సంతోషంగా ఉందని ఫ్లెమింగ్ తెలిపాడు. 'టెస్ట్ కోచ్‌గా ఇంగ్లండ్ జట్టులో చేరబోతున్నందుకు చాలా సంతోషంగా ఉంది. ప్రపంచ క్రికెట్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన కోచింగ్ పదవుల్లో ఇది ఒకటి. అలాంటి పదవి బాధ్యతలను చేపట్టడాన్ని గౌరవంగా భావిస్తున్నా. ఆటగాళ్లతో పని చేయడానికి, బ్రెండన్ మెక్‌కల్లమ్, బెన్ స్టోక్స్ సాధించిన ప్రగతిని కొనసాగించేందుకు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా. స్వల్ప కాలిక, దీర్ఘ కాలిక ప్రణాళికలతో జట్టుకు విజయాలను అందించే ప్రయత్నం చేస్తాం. జట్టులోని యువ ప్రతిభావంతులకు సాయం చేయడమే మా ప్రధాన లక్ష్యం.'అని ఫ్లెమింగ్ చెప్పుకొచ్చాడు. న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ అయిన స్టీఫెన్ ఫ్లెమింగ్.. చెన్నై సూపర్ కింగ్స్ హెడ్ కోచ్‌గా 18 ఏళ్ల సేవలందించాడు. ఈ 18 సంవత్సరాల్లో 10 సార్లు జట్టును ఫైనల్‌కు చేర్చడంతో పాటు ఐదు టైటిళ్లు అందించాడు. సీఎస్కేకు చెందిన ఇతర గ్లోబల్ ఫ్రాంచైజీలకు కూడా కోచ్‌గా సేవలందించాడు. న్యూజిలాండ్ కెప్టెన్‌గా 80 మ్యాచ్‌ల్లో 28 విజయాలు అందించాడు. కౌంటీ క్రికెట్‌లో నాటింగమ్‌షైర్ జట్టుకు సారథిగా వ్యవహరించి 2005 కౌంటీ ఛాంపియన్‌షిప్ టైటిల్ అందించాడు. 2017 నుంచి 2022 వరకు కెప్టెన్‌గా కొనసాగిన జోరూట్ తిరిగి సారథ్య బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధమయ్యాడు. గతంలో 64 టెస్ట్‌ల్లో జోరూట్ 27 విజయాలు అందించాడు. ఇంగ్లండ్ సారథ్య బాధ్యతలను తిరిగి చేపట్టడం గర్వంగా ఉందని జోరూట్ తెలిపాడు. ఈ బాధ్యతల్లో కొనసాగడం ఎంతో కష్టమైనప్పటికీ.. సంతృప్తినిస్తోందని చెప్పాడు. స్టీఫెన్‌తో కలిసి పనిచేయడం గొప్ప అవకాశంగా భావిస్తున్నానని వెల్లడించాడు.



# భారత హాకీ కిట్ కలర్ మార్పుపై రచ్చ!

భారత హాకీ జట్ల జెర్సీ రంగును బ్లూ నుంచి కాషాయ రంగుకు (ఆరెంజ్) మార్చడంపై మాజీ కెప్టెన్ వీరేన్ రస్కిన్హా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే ఇందులో ఎలాంటి రాజకీయ కోణం లేదని హాకీ ఇండియా స్పష్టం చేసింది. వచ్చే నెలలో బెల్జియం, నెదర్లాండ్స్ వేదికగా జరగనున్న ఎఫ్ఐహెచ్ హాకీ వరల్డ్ కప్ 2026 కోసం భారత పురుషుల, మహిళల జట్లు సిద్ధమవుతున్నాయి. ఈ మెగా టోర్నీ కోసం హాకీ ఇండియా (హెచ్ఐ) జాతీయ జట్ల జెర్సీ రంగును అనూహ్యంగా మార్చేసింది. దశాబ్దాలుగా భారత జట్టుకు ఐడెంటిటీగా ఉన్న సంప్రదాయ బ్లూ జెర్సీ స్థానంలో కొత్తగా కాషాయం (ఆరెంజ్) రంగు కిట్‌ను పరిచయం చేసింది. ఈ నిర్ణయంపై భారత హాకీ జట్టు మాజీ కెప్టెన్ వీరేన్ రస్కిన్హా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జెర్సీ రంగు మార్చడం వెనుక ఉన్న లాజిక్ ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ రంగు మార్పుపై సోషల్ మీడియాలో సైతం పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఈ వివాదంపై స్పందించిన హాకీ ఇండియా సీనియర్ అధికారి ఒకరు.. ఇందులో ఎలాంటి రాజకీయ కోణం లేదని కొట్టిపారేశారు. జాతీయ జెండాలో కాషాయం ఒక భాగమని, మార్పును ఎప్పుడూ స్వాగతించాలని ఆయన సూచించారు. సంప్రదాయ బ్లూ జెర్సీని మార్చడానికి ప్రధాన కారణం ఆటగాళ్ల విజిబిలిటీ అని ఆ అధికారి వివరించినట్లు న్యూస్18 ఇంగ్లీష్ కథనం పేర్కొంది. ప్రస్తుతం అంతర్జాతీయ హాకీ మ్యాచ్‌లు ఎక్కువగా బ్లూ టర్ఫ్ (మైదానం) పైనే జరుగుతున్నాయి. మైదానం రంగు, జెర్సీ రంగు ఒకేలా ఉండటం వల్ల ఆటగాళ్లను గుర్తించడం వీక్షకులకు కష్టంగా మారుతోంది. ఆరెంజ్ రంగు వల్ల కాంట్రాస్ట్ పెరిగి, టర్ఫ్‌పై ఆటగాళ్లు స్పష్టంగా కనిపిస్తారని ఆయన పేర్కొన్నారు. కొత్త కిట్‌ను ఆవిష్కరిస్తూ హాకీ ఇండియా ట్విట్టర్ (ఎక్స్) వేదికగా ఆసక్తికరమైన పోస్ట్ చేసింది. జెర్సీలోని ప్రతి కుట్టు ఒక కథను చెబుతుందని, ప్రతి రంగు దేశ గర్వాన్ని చాటుతుందని పేర్కొంది. కాషాయ రంగు ధైర్యం, త్యాగం, విజయాలకు ప్రతీక అని వెల్లడించింది. ఉదయిస్తున్న సూర్యుడి స్ఫూర్తితో రూపొందించిన ఈ డిజైన్ సరికొత్త ఆరంభానికి సంకేతమని వివరించింది. ఇందులో తెలుపు రంగు ప్రత్యామ్నాయ జెర్సీలు కూడా ఉంటాయి. జెర్సీ మార్పు నిర్ణయం తనకు ఎంతో ఇబ్బందికరంగా అనిపించిందని వీరేన్ రస్కిన్హా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. భారత జట్టు వారసత్వం, గుర్తింపు ఎప్పుడూ 'బ్లూ' రంగుతోనే ముడిపడి ఉన్నాయని ఆయన గుర్తుచేశారు. ఎన్నో ఏళ్ల పాటు గర్వంగా బ్లూ జెర్సీ ధరించానని, అభిమానులు కూడా మన జట్టును ఆ రంగులోనే చూడాలని కోరుకుంటారని అభిప్రాయపడ్డారు. తన వాదన కేవలం జాతీయ జట్టు గుర్తింపు, వారసత్వం గురించేనని రస్కిన్హా స్పష్టం చేశారు.

# ఫైనల్‌లోకి దూసుకెళ్లిన నీరజ్ చోప్రా

స్కాట్లాండ్‌లోని గ్లాస్గోలో జరుగుతున్న 2026 కామన్వెల్త్ గేమ్స్‌లో భారత స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రా జావెలిన్ త్రో ఫైనల్‌కు అర్హత సాధించాడు. స్కాట్లాండ్‌లోని గ్లాస్గో వేదికగా జరుగుతున్న 2026 కామన్వెల్త్ గేమ్స్ ఎనిమిదో రోజు పోటీలు ఆసక్తికరంగా కొనసాగుతున్నాయి. భారత అథ్లెటిక్స్ జట్టుకు శుభవార్తగా, రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత నీరజ్ చోప్రా పురుషుల జావెలిన్ త్రో ఫైనల్‌కు అర్హత సాధించాడు. అతనితో పాటు భారత అథ్లెట్లు యశ్‌వీర్ సింగ్, రోహిత్ యాదవ్ కూడా ఫైనల్‌లోకి ప్రవేశించారు. దీంతో జావెలిన్ త్రో విభాగంలో భారత్‌కు పతక అవకాశాలు మరింత బలపడ్డాయి. ఈ విభాగానికి సంబంధించిన పతకాల పోటీలు జూలై 31న జరగనున్నాయి. ప్రస్తుతం కామన్వెల్త్ గేమ్స్‌లో అథ్లెటిక్స్, వెయిట్‌లిఫ్టింగ్, బాల్స్ పోటీలు కొనసాగుతుండగా, ట్రాక్ సైక్లింగ్‌లో కూడా భారత్ తన ప్రచారాన్ని ప్రారంభించనుంది. భారత క్రీడాభిమానుల దృష్టి ఇప్పుడు జావెలిన్ త్రో ఫైనల్‌పై కేంద్రీకృతమైంది. స్వర్ణ పతకానికి ప్రధాన పోటీదారుడిగా భావిస్తున్న నీరజ్ చోప్రా క్వాలిఫికేషన్ రౌండ్‌లో అంచనాలకు తగ్గ ప్రదర్శన చేయకపోయినా, ఫైనల్‌లోకి సులభంగా అర్హత సాధించాడు. జావెలిన్ త్రోలో నేరుగా ఫైనల్‌కు చేరాలంటే 85 మీటర్ల క్వాలిఫికేషన్ మార్క్‌ను అధిగమించాల్సి ఉంటుంది. అయితే తొలి ప్రయత్నంలో నీరజ్ 76.28 మీటర్లు మాత్రమే విసరగలిగాడు. దీంతో నేరుగా అర్హత సాధించే మార్క్‌ను అందుకోలేకపోయాడు. అయితే రెండో ప్రయత్నంలో తన ప్రదర్శనను మెరుగుపరుచుకున్న నీరజ్ 79.61 మీటర్లు జావెలిన్ విసిరి మొత్తం ఫలితాల్లో ఐదో స్థానంలో నిలిచాడు. దీంతో ఫైనల్‌కు అర్హత సాధించాడు. భారత జట్టుకు చెందిన మరో ఇద్దరు జావెలిన్ త్రోయర్లు కూడా మంచి ప్రదర్శన కనబరిచారు. రోహిత్ యాదవ్ 78.37 మీటర్లు, యశ్‌వీర్ సింగ్ 74.45 మీటర్లు నమోదు చేసి ఇద్దరూ ఫైనల్‌లో చోటు దక్కించుకున్నారు. క్వాలిఫికేషన్ రౌండ్‌లో పాకిస్థాన్ ఒలింపిక్ ఛాంపియన్ అర్షద్ నదీమ్ తొలి ప్రయత్నంలోనే విఫలమవడం ఆసక్తికరంగా మారింది.




# అంతర్జాతీయ క్రికెట్‌కు అజింక్య రహానే గుడ్‌బై..



భారత స్టార్ బ్యాటర్, మాజీ వైస్ కెప్టెన్ అజింక్య రహానే అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. సుమారు 17 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌కు ముగింపు పలుకుతూ సోషల్ మీడియా వేదికగా అభిమానులతో ఒక భావోద్వేగ సందేశాన్ని పంచుకున్నాడు. టీమిండియా మాజీ వైస్ కెప్టెన్, క్లాసిక్ బ్యాటర్ అజింక్య రహానే అంతర్జాతీయ క్రికెట్‌కు అధికారికంగా వీడ్కోలు పలికాడు. తన 17 ఏళ్ల సుదీర్ఘ క్రికెట్ ప్రయాణానికి ముగింపు పలుకుతూ గురువారం సోషల్ మీడియాలో ఒక ఎమోషనల్ వీడియో ద్వారా రిటైర్మెంట్ నిర్ణయాన్ని వెల్లడించాడు. జీవితంలో సరైన సమయం వచ్చినప్పుడు దాన్ని గౌరవించి ముందుకు సాగక తప్పదని ఈ సందర్భంగా అతడు ఉద్వేగభరితంగా పేర్కొన్నాడు. తనకు అండగా నిలిచిన బీసీసీఐకి, తన తోటి ఆటగాళ్లకు, కోచ్‌లకు, కోట్లాది మంది అభిమానులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపాడు. 2011లో ఇంగ్లండ్‌పై టీ20 మ్యాచ్‌తో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన రహానే, ఆ తర్వాత కొన్ని రోజులకే రాహుల్ ద్రావిడ్ ఫేర్‌వెల్ సిరీస్‌లో వన్డేల్లోకి ఎంట్రీ ఇచ్చాడు. ఇక 2013లో ఢిల్లీ వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌తో టెస్ట్ క్రికెట్‌లోకి అడుగుపెట్టాడు. విరాట్ కోహ్లీ, పుజారాలతో కలిసి మిడిలార్డర్‌లో భారత జట్టుకు బలమైన వెన్నెముకగా నిలిచాడు. కఠినమైన విదేశీ పిచ్‌లపై అతడు ఆడిన అద్భుతమైన ఇన్నింగ్స్‌లు ఎప్పటికీ గుర్తుండిపోతాయి. ఆస్ట్రేలియా గడ్డపై 2020–21 బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భారత జట్టును ముందుండి నడిపించిన తీరు అతడి కెరీర్‌లోనే ఒక సువర్ణాధ్యాయం. కోహ్లీ గైర్హాజరీలో జట్టు బాధ్యతలు చేపట్టి, యువ ఆటగాళ్లతో అద్భుతాలు సృష్టించాడు. మెల్‌బోర్న్‌లో అద్భుతమైన సెంచరీ సాధించి జట్టుకు చారిత్రాత్మక సిరీస్ విజయాన్ని అందించాడు. ఆ సిరీస్ అతడి నాయకత్వ లక్షణాలను ప్రపంచానికి చాటిచెప్పింది. భారత్ తరపున 85 టెస్టులు ఆడిన రహానే 5077 పరుగులు సాధించాడు. అలాగే 90 వన్డేల్లో 2962 పరుగులు, 20 టీ20 మ్యాచుల్లో 375 పరుగులు తన ఖాతాలో వేసుకున్నాడు. జులై 2023లో వెస్టిండీస్‌తో జరిగిన టెస్ట్ మ్యాచే అతడి కెరీర్‌లో ఆఖరి అంతర్జాతీయ మ్యాచ్. అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించినప్పటికీ, ఐపీఎల్ లాంటి ఫ్రాంచైజీ లీగ్స్‌తో పాటు దేశవాళీ క్రికెట్‌లో తాను కొనసాగుతానని రహానే స్పష్టం చేశాడు. ఈ ఏడాది ఐపీఎల్ 2026లో కూడా అతడు ఆడాడు. పదేళ్లకు పైగా తన అద్భుత ఆటతో కోట్లాది మంది మనసులు గెలుచుకున్న ఈ సైలెంట్ వారియర్ రిటైర్మెంట్ వార్త అభిమానులను తీవ్రంగా నిరాశపరిచింది.

# రామాయణ ట్రైలర్ విడుదల

ఎన్నిసార్లు విన్నా.. ఎంతమంది చెప్పినా.. ఎన్ని యుగాలు మారినా అజరామరం రామ చరితం.. 'రామాయణం' నిత్యనూతనం. ఇప్పటికే ఎన్నోసార్లు దృశ్యరూపం దాల్చిన ఈ మహాకావ్యం ఇప్పుడు మరోసారి నేటితరం ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది.దర్శకుడు నితీశ్ తివారీ మలిచిన 'రామాయణ' ట్రైలర్ బ్రహ్మ ముహూర్తంలో ప్రేక్షకుల ముందుకొచ్చింది. అత్యున్నత నిర్మాణ విలువలు, అద్భుతమైన విజువల్ ఎఫెక్ట్స్, అబ్బురపరిచేలా ఉన్న హాలీవుడ్ స్థాయి గ్రాఫిక్స్ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. సీతారాముల కల్యాణం, వనవాసం, రామరావణుడి యుద్ధం.. ఇలా ప్రతి ఫ్రేమ్ ఆ అద్భుత గాథను కళ్లకు కడుతోంది. దేవలోకం.. భూలోకం.. పాతాళలోకం.. ముల్లోకాల్లో ఇక ఒక్కటే సామ్రాజ్యం.. రావణ రాజ్యం' అంటూ యశ్ పాత్రను పరిచయం చేస్తూ ట్రైలర్ ప్రారంభమైంది. యశ్ స్క్రీన్‌పై కనిపించిన ప్రతిసారీ తన గాంభీర్యం ప్రేక్షకులను మైమరిపించింది. 'చీకట్లను పారదోలేందుకు ప్రతి యుగంలోనూ ఆ శ్రీమహావిష్ణువు అవతారమెత్తుతాడు' అంటూ రాముడి పాత్రను తీర్చిదిద్దిన విధానం ఆకట్టుకుంది. ప్రశాంతత, ధర్మనిష్ఠను ప్రతిబింబించే రాముడిగా రణ్‌బీర్ కపూర్ ఆకట్టుకున్నారు. మొత్తం నాలుగు నిమిషాల ఈ ట్రైలర్ సినీ ప్రేక్షకులను త్రేతాయుగానికి తీసుకెళ్లింది. ట్రైలర్‌లో ఎక్కువ చర్చిస్తున్న పాత్రల్లో ఒకటి సీతాదేవి. సాధారణంగా మృదుస్వభావిగా చూపించే సీతమ్మను ఇందులో ఖడ్గం పట్టిన యోధురాలిగా చూపించారు. లక్ష్మణ రేఖ సందర్భంలో కూడా ఆమె చేతిలో ఖడ్గం కనిపించడంతో ఇందులో ఆమె పాత్రను కొత్తగా చూపించనున్నట్లు అర్థమవుతోంది. పుష్పక విమానం రామాయణంలో ఎంతో కీలకం. గతంలో వచ్చిన చిత్రాల్లో ఇది సాధారణంగా కనిపించినా.. ఈ సినిమాలో మాత్రం భారీ తామరపువ్వు ఆకారంలో ప్రత్యేక డిజైన్‌తో చూపించారు. ఇక, లంకను జయించిన తర్వాత మూడు లోకాలపై ఆధిపత్యం సాధించాలని రావణుడు సంకల్పిస్తాడు. ఈ క్రమంలో దేవేంద్రుడితో యుద్ధానికి సంబంధించిన సన్నివేశాల్లో ఐరావతాన్ని అద్భుతమైన విజువల్‌తో ఆవిష్కరించారు. సీతను అపహరించే సమయంలో రావణుడిని అడ్డుకునే జటాయువు పాత్రకు ట్రైలర్‌లో మంచి ప్రాధాన్యం దక్కింది. భారీ గరుత్మంతుడిలా, శక్తిమంతమైన రూపంలో జటాయువును చూపించడం విశేషం. శూర్పణఖ భర్త విద్యుజ్జిహ్వ పాత్రలో వివేక్ ఒబెరాయ్ కనిపించారు. రావణుడికి ఆయనకు మధ్య జరిగే ఘర్షణ చూస్తుంటే.. ఇప్పటివరకూ రామాయణంలో తెరపైకి రాని పాత్రలకు కూడా సముచిత స్థానం కల్పించినట్లు తెలుస్తోంది. రాముడి వనవాసానికి కారణమైన మంథర పాత్రను శీబా చద్దా పోషించారు. కైకేయిగా లారా దత్త ప్రత్యేకంగా కన్పించారు. శివధనుస్సు విరిచిన అనంతరం పరశురాముడు రాముడిని కలిసే ఘట్టం కూడా ట్రైలర్‌లో ఉంది. తన ధర్మ బాధ్యతలను రాముడికి అప్పగించి తపస్సు కోసం వెళ్లే పరశురాముడి పాత్రలోనూ రణ్‌బీర్ కన్పించడం ప్రేక్షకులను సర్‌ప్రైజ్ చేసింది. రాముడిని తిరిగి అయోధ్యకు తీసుకురావడానికి చిత్రకూటానికి వెళ్తాడు భరతుడు. రాముడు నిరాకరించడంతో ఆయన పాదుకలను సింహాసనంపై ఉంచి రాజ్యాన్ని పాలించిన సోదరుడిగా ఆదినాథ్ కొఠారే ఆకట్టుకున్నారు. హనుమంతుడిగా సన్నీ దేవోల్, లక్ష్మణుడిగా రవీ దూబే కూడా తమ పాత్రలకు న్యాయం చేశారు. రకుల్ ప్రీత్ సింగ్ శూర్పణఖ పాత్రలో కనిపించి ఔరా అనిపించారు. రాముడిని ఆకర్షించేందుకు ప్రయత్నించడం, లక్ష్మణుడు ఆమె ముక్కు కోసే సన్నివేశాలు ప్రత్యేకంగా నిలిచాయి. 'ప్రతీకారం తీర్చుకుంటాను శూర్పణఖ.. రాముడికి జరిగే అవమానం ఘోరంగా ఉంటుంది' అంటూ యశ్ చెప్పే డైలాగ్‌తో రామ–రావణ యుద్ధం ఎంత భీకరంగా ఉంటుందో ట్రైలర్‌లో హింట్ ఇచ్చారు దర్శకుడు. ఇక ట్రైలర్‌లో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన మరో విషయం.. నేపథ్య సంగీతం.. ప్రపంచ ప్రఖ్యాత సంగీత దర్శకుడు హాన్స్ జిమ్మర్‌తో పాటు ఏ.ఆర్. రెహమాన్ అందించిన సంగీతం సినిమా స్థాయిని మరింత పెంచేలా ఉంది. విజువల్స్‌కు తగ్గట్టుగా వినిపించిన సంగీతం.. ప్రతి సన్నివేశానికి వీక్షకులు లీనమయ్యేలా ఉంది. 'రామాయణ' ట్రైలర్ కేవలం ఓ సినిమా ప్రమోషన్‌లా కాకుండా భారతీయ ఇతిహాసాన్ని ప్రపంచ స్థాయిలో ఆవిష్కరించే మహత్తర సినీ ప్రయాణానికి నాందిగా నిలిచింది. మొదటి భాగం ఈ ఏడాది దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా విడుదల చేసిన ట్రైలర్‌లో విజువల్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి రూ.4000 కోట్ల బ్జడెట్‌తో ఈ చిత్రం రూపొందుతోంది. రామానంద్ సాగర్ ఆవిష్కరించిన ధారావాహికలో రాముడిగా కనువిందు చేసిన అరుణ్ గోవిల్ ఇప్పుడు దశరథుడిగా నటిస్తున్నారు. సీబా చద్దా.. మంథర పాత్ర పోషిస్తుండగా, శిశిర్ శర్మ వశిష్ఠ మహర్షిగా, అజింక్య దేవ్ విశ్వామిత్ర మహర్షిగా చేస్తున్నారు.









## అద్భుత దృశ్య కావ్యంగా మలచిన నితీశ్ తివారి




# మరో లవ్ గ్రాక్ మూవీ శ్రీనివాస మంగాపురం

ఆకట్టుకున్న జయకృష్ణ, రాషా తండానీ నటన ఘట్టమనేని కుటుంబం నుంచి యువ హీరోగా పరిచయమవుతున్న జయకృష్ణ, ప్రముఖ నటి రవీనా టండన్ కూతురు రాషా తడాని జంటగా నటించిన తాజా చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. 'ఆర్ఎక్స్ 100', మంగళవారం వంటి సంచలన చిత్రాల తర్వాత దర్శకుడు అజయ్ భూపతి తెరకెక్కించిన ఈ చిత్రంపై మొదటి నుంచి భారీ అంచనాలున్నాయి. మోహన్ బాబు, శ్యామ్, బ్రహ్మాజీ వంటి హేమాహేమీలు ప్రధాన పాత్రలు పోషించిన ఈ సినిమా నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తిరుపతి నేపథ్యంతో ఈ కథ సాగుతుంది. నగరంలో అడుగుపెట్టిన యువకుడు శ్రీను (జయకృష్ణ) .. అక్కడి పవర్ ఫుల్ వ్యక్తి పెద్దిరెడ్డి (శ్యామ్) గారాల కూతురు మంగ (రాషా తడాని)ని మొదటి చూపులోనే ఇష్టపడతాడు. ఆమెకు చేరువయ్యే ప్రయత్నంలో ఉండగా, మంగ జీవితానికి సంబంధించి ఒక షాకింగ్ నిజం తెరపైకి వస్తుంది. అసలు ఆ రహస్యాన్ని పెద్దిరెడ్డి ఎందుకు దాచాడు? శ్రీను నేపథ్యం ఏమిటి? మంగతో అతనికి ఉన్న పాత సంబంధం ఏంటి? బళ్లారి ప్రాంతానికి చెందిన వెంకటప్పయ్య (మోహన్ బాబు), లక్ష్మీపతి (అజయ్)ల మధ్య జరిగిన వివాదాలు ఈ కథను ఎలాంటి మలుపులు తిప్పాయి? చివరికి శ్రీను తన ప్రేమను ఎలా గెలుచుకున్నాడు అనేదే ఈ చిత్ర అసలు కథ. దర్శకుడు అజయ్ భూపతి కూడా 'శ్రీనివాస మంగాపురం' కోసం ఇదే రొటీన్ మాస్ కమర్షియల్ బాటపట్టారు. స్టోరీ పరంగా పెద్దగా కొత్తదనం లేకపోయినా.. విలన్ క్రూరత్వం, హీరోయిన్ వెనక హీరో పడే లవ్ ట్రాక్, మధ్య మధ్యలో వచ్చే పాటలతో ప్రథమార్థం సాగిపోతుంది. జై కృష్ణ తన డాన్సులతో అలరించగా, నరేష్, బ్రహ్మాజీల కామెడీ మంచి రిలాక్సేషన్ ఇస్తుంది. ద్వితీయార్థంలో వచ్చే ఫ్లాష్ బ్యాక్, హీరో హీరోయిన్ల అసలు కథ, యాక్షన్ సీక్వెన్సెస్ ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతాయి. తన గత చిత్రాల తరహాలో కాకుండా, అజయ్ భూపతి ఎలాంటి రిస్క్ తీసుకోకుండా పూర్తిగా 'సేఫ్ గేమ్' ఆడేశారు. పకడ్బందీ స్క్రీన్ ప్లే, బలమైన క్యారెక్టరైజేషన్స్‌పై మరికాస్త దృష్టి పెట్టి ఉంటే ఈ లవ్ అండ్ యాక్షన్ డ్రామా మరో స్థాయిలో ఉండేది. జయకృష్ణ, రాషా తడాని తమ తొలి సినిమాతోనే అద్భుతమైన ప్రతిభను కనబరిచారు. ముఖ్యంగా జయకృష్ణ ఎమోషనల్ సన్నివేశాల్లో మంచి పరిణతి చూపించాడు. డాన్సులు, యాక్షన్ సీక్వెన్స్‌లలోనూ ఆకట్టుకున్నాడు. రాషా తడాని కూడా తన అందం, అభినయంతో తొలి చిత్రంతోనే మంచి మార్కులు కొట్టేసింది. వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ సినిమాకే హైలైట్‌గా నిలిచింది. మోహన్ బాబు తన సీనియారిటీతో, పవర్ ఫుల్ ఇంటెన్సిటీతో పాత్రకు పూర్తి వన్యాయం చేశారు. కిక్ శ్యామ్, అజయ్ తమ విలనిజంతో సినిమాను నిలబెట్టగా.. బ్రహ్మాజీ, నరేష్‌ల కామెడీ అక్కడక్కడా నవ్విస్తుంది. దర్శకుడు అజయ్ భూపతి ఎంచుకున్న లవ్ అండ్ ఫ్యాక్షన్ బ్యాక్‌డ్రాప్ బాగుంది. సంగీత దర్శకుడు జీవి ప్రకాష్ కుమార్ అందించిన పాటలు, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమా స్థాయిని పెంచాయి. ముఖ్యంగా స్క్రీన్ పై పాటలు మరింత రిచ్‌గా కనిపిస్తాయి.




# సూర్య 47 దీపావళి బరికోసం సిద్ధం

తమిళ స్టార్ హీరో సూర్యకు ఇప్పటికే వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. రీసెంట్ గా జితు మాధవన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'సూర్య47' షూటింగ్‌ను పూర్తి చేశారు. చిత్రబృందం విడుదల చేసిన బీహైండ్ ది సీన్స్ వీడియోతో షూటింగ్ ముగిసిన విషయాన్ని అధికారికంగా వెల్లడించగా, ఇప్పుడు ఈ సినిమా విడుదల తేదీపై ఆసక్తికర చర్చ మొదలైంది. అందుతున్న సమాచారం ప్రకారం, 'సూర్య47'ను ఈ దీపావళి సందర్భంగా థియేటర్లలో విడుదల చేయాలని నిర్మాతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఈ వార్త నిజమైతే సూర్యకు ఇది వరుసగా మూడో థియేట్రికల్ విడుదలగా నిలవనుంది. ఇప్పటికే 'కరుప్పు'తో ప్రేక్షకులను పలకరించిన ఆయన, ఆగస్టు 14న వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్'తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆ సినిమా విడుదలైన కొద్ది నెలలకే 'సూర్య47' కూడా థియేటర్లలోకి వస్తే, ఒకే ఏడాదిలో వరుసగా మూడు సినిమాలతో అభిమానులను అలరించిన హీరోగా సూర్య నిలుస్తారు. అయితే దీపావళి బరిలో వెట్రిమారన్ దర్శకత్వంలో సిలంబరసన్ టి.ఆర్ నటిస్తున్న 'అరసన్' కూడా విడుదలకు సిద్ధమవుతుండటంతో బాక్సాఫీస్ వద్ద ఆసక్తికర పోటీ నెలకొనే అవకాశం కనిపిస్తోంది.

# విశ్వంభరతో పోటీ పడనున్న జైలర్-2

అగ్ర కథానాయకుడు మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరుపుకోవడానికి ఆయన అభిమానులు ఇప్పటినుంచే ఇప్పటి నుంచే ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.




అయితే ఆగష్టు 22న రానున్న మెగాస్టార్ బర్త్ డే కానుకగా ఆయన నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ సోషియో-ఫాంటసీ చిత్రం 'విశ్వంభర' నుంచి అదిరిపోయే అప్‌డేట్ రాబోతున్నట్లు తెలుస్తుంది. దర్శకుడు మల్లిడి వశిష్ట తెరకెక్కిస్తున్న ఈ భారీ బ్జడెట్ చిత్రం, విజువల్ ఎఫెక్ట్స్ పనుల కారణంగా ఇంతకాలం ఆలస్యం అయినప్పటికీ, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను శరవేగంగా ముగింపు దశకు తీసుకువచ్చింది. యూవీ క్రియేషన్స్ సంస్థ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో అందాల తార త్రిష నటిస్తుండగా, ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి అద్భుతమైన బాణీలు, నేపథ్య సంగీతాన్ని అందిస్తున్నారు. కాగా, ఈ సోషియో-ఫాంటసీ అడ్వెంచర్‌ను దసరా పండుగకు చేస్తూ అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇందుకు సంబంధించిన అధికారిక ప్రకటన ఆగస్టు 22న చిరంజీవి జన్మదిన వేడుకల సందర్భంగా చిత్రబృందం ప్రకటించబోతున్నట్లు సమాచారం. అయితే చిరంజీవి దసరా పండుగకు రాబోతుండటం అంతకంటే ఒక్కరోజు ముందుగానే రజనీకాంత్ జైలర్ 2 ప్రేక్షకులు రాబోతుండడంతో ఈ రెండు సినిమాలకు బాక్సాఫీస్ వద్ద బిగ్ క్లాష్ ఉండబోతున్నట్లు తెలుస్తుంది.



Printed & published owned by K.SRAVAN KUMAR. Printed Published RK PRINTING PRESS at 6-1-948 Boyawada Street Nalgonda.Pin : 508001. Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. RNI.NO.APTEL/2009/29433.(CELL ) 9866330400 prajaveekshanam@gmail.com